బుధవారం
29-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 128
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సవాళ్లు అధిగమిస్తూ ప్రగతి పథంలో ముందుకు

ఎన్ని సవాళ్లు ఎదురైనాగానీ వాటిని అధిగమిస్తూ ప్రగతి పథంలో ముందుకు వెళుతున్నామని, చైనా సాధిస్తున్న పురోగతి అభినందనీయమని ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్స్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో జిన్‌పింగ్ మాట్లాడారు. 5లో

NBK
PADMA BHUSHAN

నందమూరి బాలకృష్ణ

క్రమశిక్షణ, కష్టపడే తత్వం ఉన్న మాస్ హీరో. అన్నివేళలా ప్రజలకు అండగా నిలిచే నిబద్ధతగల నాయకుడు. క్యాన్సర్ పేషంట్లను, పేదలను ఆదుకునే ఆప్తుడు. ఒక కొడుకుగా, ఒక భర్తగా, ఒక తండ్రిగా, ఒక సోదరుడిగా, ఒక తాతగా తన బాధ్యతలను ఏనాడూ మరువని వ్యక్తి.

మీకు భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారం వచ్చినందుకు మేమందరం ఎంతో గర్విస్తున్నాం.
మీ చుట్టూ ఉండే అందరి జీవితాలకు వెలుగును పంచుతూ... మీరు ఎల్లప్పుడూ ఇలాగే చిరునవ్వులు చిందిస్తూ ఉండాలి.

జై బాలయ్య!

నందమూరి మరియు నారా కుటుంబసభ్యులు

శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శ్రీమతి భువనేశ్వరి । శ్రీ నారా లోకేష్, శ్రీమతి బ్రాహ్మణి, దేవాన్ష్ । శ్రీమతి నందమూరి వసుంధరా దేవి
శ్రీ నందమూరి మోక్షజ్ఞ తారక రామ తేజ । శ్రీ మతుకుమిల్లి శ్రీభరత్, శ్రీమతి తేజస్విని, ఆర్యవీర్ । శ్రీ నందమూరి జయకృష్ణ, శ్రీమతి పద్మజ
కీ.శే. నందమూరి సాయికృష్ణ, శ్రీమతి మాధవి మణి । కీ.శే. నందమూరి హరికృష్ణ, శ్రీమతి లక్ష్మి । శ్రీ నందమూరి మోహనకృష్ణ, శ్రీమతి శాంతి
శ్రీ నందమూరి రామకృష్ణ, శ్రీమతి జయశ్రీ । శ్రీ నందమూరి జయశంకర్ కృష్ణ, శ్రీమతి శ్రీదేవి । శ్రీమతి గారపాటి లోకేశ్వరి, శ్రీ జ్ఞానేశ్వర రావు
శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, శ్రీ వెంకటేశ్వర రావు । కీ.శే. ఉమా మహేశ్వరి, శ్రీ కంఠమనేని శ్రీనివాస్ ప్రసాద్

విశాలాంధ్ర

ఉత్తమ అవార్డు అందుకున్న ప్రాజెక్ట్ మేనేజర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : 76వగణ తంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలను అందించినందుకు గుర్తింపుగా నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ప్రాజెక్టు మేనేజర్ అండ్ సదరం విభాగానికి చెందిన బట్టు శోభరాణి ఉత్తమ అవార్డు అందుకున్నారు ఈ విధంగానే భవిష్యత్తులో మరింత కష్టపడి పని చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, రెవెన్యూ కలెక్టర్ కిషోర్ కుమార్ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి ఉన్నారు .

జర్నలిస్టుల కోసం నిరంతర పోరాటం

విశాలాంధ్ర - కొమరం భీం. బెజ్జూర్ : జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతర పోరాటం చేస్తామని టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహేమాన్ అన్నారు. మంగ ళవారం బెజ్జూర్ మండల కేంద్రంలో జర్నలిస్టులకు టియుడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. తెలం గాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యల కోసం టియుడబ్ల్యూజే ముందుండి పోరాటం చేస్తుందన్నారు.

చర్మ సమస్యలకు కాలుష్యమే ప్రధాన కారణం

హైదరాబాద్: కొన్ని రోజులుగా హైదరాబాద్ నగరంలో చలి పెరగడంతో వాయునాణ్యత సూచి (ఏక్యూఐ) దారుణంగా ఉండడంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. చర్మ సమస్యలు బాగా ఎక్కువయ్యాయని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మణికొండ అపోలో క్లినిక్‌లో జనరల్ ఫిజిషియన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ ఉష గడ్డం దీనిగురించి చెబుతూ, “మా క్లినిక్‌కు రోజూ 5-8 మంది రోగులు డెర్మటైటిస్, మొటిమలు, పిగ్మెంటేషన్, ఎలర్జీల్లాంటి చర్మసమస్యలతో వస్తున్నారు. ఇదంతా వాయుకాలుష్యం వల్లనే వస్తోంది. వాయునాణ్యత, ఆరోగ్యంపై దాని ప్రభావం తెలియాలంటే ఏక్యూఐ అనేది కీలకం. 50 లేదా అంతకంటే తక్కువ ఏక్యూఐ ఉంటేనే వాయునాణ్యత బాగున్నట్లు. మన చర్మం వాయుకాలుష్యానికి బాగా గురవుతుంటుంది. మసి, పొగ, అచ్చు, పుప్పొడి, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి కాలుష్య కారకాలు నేరుగా తగలడం, జుట్టు ద్వారా వెళ్లడం, పీల్చుకోవడంతో చర్మంలోకి చొచ్చుకుపోతాయి” అని తెలిపారు. ఆరోగ్యకరమైన చర్మం కోసం రోజుకు రెండుసార్లు చర్మాన్ని శుభ్రపరచడం, యూవీ రేడియేషన్ నుంచి రక్షించడానికి బ్రాడ్-స్పెక్ట్రం సన్ స్క్రీన్‌ను ఉపయోగించడం, చర్మసంరక్షణ ఉత్పత్తులను ఎంచుకోవడం, విటమిన్లు ఎ, బి 3, సి, ఇ, గ్రీన్ టీ సారాలు సేవించడం వంటివి చేయాలని సూచించారు.

లాభాల బాటలో ఎల్‌టీఎఫ్

ముంబయి: ఎల్ అండ్ టీ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్‌టీఎఫ్) డిసెంబర్ 31,2024తో ముగిసిన తొమ్మిది నెలలకు ఏకీకృత పన్ను తర్వాత లాభం రూ. 2,007 కోట్లుగా నమోదు చేసింది. ఇది డిసెంబర్ 31,2023తో ముగిసిన తొమ్మిది నెలల్లో 14% వృద్ధిని సూచిస్తుంది డిసెంబర్ 31, 2024తో ముగిసిన మూడవ త్రైమాసికంలో ఏకీకృత ప్యాట్ రూ. 626 కోట్లుగా నమోదైంది. ఇది రూ.92,224 కోట్ల రిటైల్ బుక్‌తో బలమైన రిటైల్ ఫ్రాంచైజీ, ఇది సంవత్సరానికి (వైఓవై) 23% పెరిగింది. రిటైల్ చెల్లింపులు రూ.15,210 కోట్లకు చేరాయి. అంటే ఇది వైఓవై 5% పెరిగింది. కాగా, ఎల్‌టీఎఫ్ యాప్ 1.5 కోట్ల డౌన్లోడ్లను దాటింది.

మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఉత్సాహంగా వార్షిక క్రీడా దినోత్సవం

హైదరాబాద్: మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వార్షిక క్రీడా దినోత్సవం ఉత్సాహంగా ప్రారంభమైంది. అథ్లెటిక్ స్ఫూర్తి, స్నేహశీలతకు శక్తివంతమైన కేంద్రంగా క్యాంపస్‌ను ఈ కార్యక్రమం మార్చింది. ఈ క్రీడా దినోత్సవంలో చాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రో-చాన్సలర్ విష్ణు మంచు, ముఖ్య అతిథి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణ, అతిథి తెలంగాణ పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు.. బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్ వంటి పోటీల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. ఈ విశ్వవిద్యాలయం క్రీడా విజయాల వారసత్వాన్ని కలిగిఉంది. క్రీడల్లో పతకాలు గెల్చుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను సైతం ఈ వర్శిటీలో అందిస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ, మంచి వ్యక్తులను రూపొందించడంలో, క్రమశిక్షణ, స్థిరత్వం వంటి విలువలను పెంపొందించడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఫైర్ వాటర్ నియో ప్రారంభం

హైదరాబాద్: ఇప్పటికే హైటెక్ సిటీ, మియాపూర్‌లలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ప్రీమియం ఫైన్ డైనింగ్ రెస్టారెంట్ ఫైర్ వాటర్ నియో తమ తాజా రెస్టారెంట్‌ను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రారంభించింది. ఈ బార్, కిచెన్ భారతీయ, అంతర్జాతీయ వంటకాలతో పాటుగా వైవిధ్యమైన కాక్‌టైల్ మెనూ అందించనుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. దాదాపు 150 సీటర్ సామర్థ్యం కలిగిన ఈ రెస్ట్రో బార్‌లో 120 సీటర్ల మల్టీపర్పస్ హాల్ కూడా ఉంది. ఫైర్ వాటర్‌లో లగ్జరీ, సమకాలీన గ్లోబల్ కంఫర్ట్ ఫుడ్‌ను తీసుకువస్తున్నామన్న విష్ణువర్ధన్‌రెడ్డి, యూరోపియన్, ఇండియన్ వంటకాలను అందించనున్నామన్నారు. 2013లో తమ తొలి రెస్టారెంట్ హైదరాబాద్‌లో ప్రారంభమైందన్న ఆయన అసాధారణ భోజన అనుభవాలను నగరవాసులకు అందించడంతో పాటుగా అతిథులకు ఎన్నటికీ నిలిచిపోయే అనుభవాలను తాము సృష్టిస్తున్నామన్నారు.

బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ పర్యటన షురూ

ముంబయి: బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ అత్యంత గొప్ప ఎడిషన్ ‘ద వన్ అండ్ వోన్లీ’ని విడుదల చేసింది. ఈ ఫ్యాషన్ టూర్ 2025 ఎడిషన్ అసా ధారణమైనదిగా ఉంటుంది. అంతర్జాతీయ ఫ్యాషన్, మ్యూజిక్, స్వచ్ఛమైన ఆశ్చర్యాన్ని ప్రేరేపించే వినోదంలో గొప్ప ప్రదర్శనలు తెస్తోంది. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌డీసీఐ)తో మరోసారి చేతులు కలిపిన ఫ్యాషన్ టూర్ తమ అందమైన సారాంశాన్ని భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన, భారతదేశంలో అత్యంతగా కోరుకునే స్టైల్ దిగ్గజాలు కొంతమందితో కలిసి సంబరం చేస్తోంది. చండీఘర్, గౌహతి, వైజాగ్ వంటి పట్టణ నగరాలకు తమ ఆకర్షణీయమైన ప్రపంచాన్ని తీసుకువెళ్లనున్నది. ఛండీఘర్‌లో, జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌తో కనికా గోయల్ హాట్ ఫ్యాషన్ మెరుపులు ప్రదర్శించనున్నారు.

హ్యుందాయ్ మోటార్ ఇండియా ఆర్థిక ఫలితాలు

గురుగ్రామ్: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికం, 9 నెలల ఆర్థిక ఫలితాలను (స్వతంత్ర మరియు కన్సాలిడేటెడ్) ఆమోదించింది. 20 24-25 ఆర్థిక సంవత్సరం 9 నెలల్లో ఆదాయం రూ.512,526.11 మిలి యన్లుగా పేర్కొంది. ఈబీఐటీడీఏ మార్జిన్ 12.53% వద్ద ఉంది. ఇది 20 23-24 ఆర్థిక సంవత్సరం 9నెలల్లో 12.67% ఉంది. ఈ కాలంలో కంపెనీ మొత్తం 570,402 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఇందులో ఎస్‌యూవీ విభాగం నుండి బలమైన సహకారంతో దేశీయ మార్కె ట్లో 445,116 యూనిట్లు ఉన్నాయి. ఎగుమతి పరిమాణం 125,286 యూనిట్లుగా ఉంది.

సాధించుకున్న హక్కులపై అవగాహన కల్పించాలి

మల్కాజిగిరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా సర్కిల్ పరిధిలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో తెలంగాణారాష్ట్ర బిల్డింగ్, కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధులుగా బి ఓ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. మారగోని ప్రవీణ్ కుమార్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు కాం శంకర్రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల్లో మండలాల్లోని అడ్డాలో పనిచేసే కార్మికులకోసం మనం పోరాడి సాధించుకున్న హక్కులకోసం మన వంతు కృషిచేయాలని చెప్పారు. మనం సాధించుకున్న మనకార్మిక చట్టాలను, వాటి వల్ల ఉపయోగపడే ప్రయోజనాలను కార్మికులకు తెలిసేలా అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నిరంతరం ఏఐటీయూసీ కార్మికుల కోసం అనేకపోరాటాలు చేసిందని ఇక ముందు కూడా ప్రభుత్వాలు మెడలు వంచి కార్మిక హక్కులను సాధించేవరకు పోరాటాలను సాగిస్తామని వారు అన్నారు. శంకర్ రావు మాటాడుతూ ప్రతి అడ్డాలో సభ్యత్వం నమోదు చేయించాలని, సభ్యత్వాలు పెంచుకోవాలని మనం చేసే సభ్యత్వలను బట్టి జిల్లా మహాసభకు డెలిగేషన్ ఉంటుందని సూచించారు. పనిచేసే ప్రతీకార్మికుడు, కార్మికురాలు తప్పనిసరి లేబర్ కార్డు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి అడ్డాయూనియన్ నాయకులు అడ్డ గుర్తింపు కార్డులు తయారుచేసి ప్రతికార్మికునికి ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోగాని పనులవద్ద గాని లేదా లేబర్ ఆఫీసులో గాని ఎలాంటి సమస్యలున్న మాదృష్టికి వస్తే సాధ్యమైనంత త్వరగా పరిస్కారం చేయడానికి కృషి చేస్తామని ఈసందర్భంగా కార్మికులకు భరోసా కల్పించారు. మరియు2025ఏప్రిల్ 21,22న రాష్ట్ర మహాసభ, మార్చి లో మల్కాజిగిరి జిల్లా మహాసభ ఉన్నందున ఈ ఫిబ్రవరి నెలలోగా జిల్లాలోని అన్ని అడ్డ మహాసభలు, మండల మహాసభలు పెట్టి కమిటీలు వేసుకొని పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు వీర నాగప్ప, జిల్లా సహాయ కార్యదర్శి గోల్లారి స్వామిదాసు, నాయకులు నర్సింగరావు, బిక్షపతి, కె. స్వామిదాసు, ఎస్. నగేష్, యాకోబు, ఓంకార్ ,కృపాకర్, బంగారయ్య, సాయిలు, జిల్లాలోని 13మండలాల అడ్డ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలిగించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: ఉపరితల మురుగు నీటి కాలు వలను శుభ్రం చేయడానికి వాహనాలు వెళ్ళడానికి ఆటంకంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్,రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అధికారులను ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ లలో పలు సమస్యలను మంగళవారం ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ముప్పది రెండవ డివిజన్ ఎల్ బి నగర్ లో ఇండ్ల మధ్య ఉన్న పెద్ద కాలువలో పూడిక తొలగించడానికి వాహనం వెళ్లడానికి ఇబ్బందవుతున్న దృష్ట్యా అడ్డుగా ఉన్న గోడ లను తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ ఆమె వెంట అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ,ఈఈ రామన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార స్వామి , పారిశుద్ధ్య పర్యవేక్షకులు యూసుఫ్ , రాజబాబు , సంపత్ , సోమేష్ తదితరులు ఉన్నారు.

రైతు మహా సభకు తరలిన బిఆర్ఎస్ నాయకులు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ జిల్లా క్లాక్ టవర్ సెం టర్ లో జరుగు రైతు మహా ధర్నా సభకు బిఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వస్తున్న నేపథ్యంలో మంగళవారం పెద్ద ఎత్తున సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో పనిచేస్తున్న హాస్పిటల్ వర్కర్స్‌కు గత ఆరు నెలల నుండి వేతనాలు పెండింగ్లో ఉన్నాయని. వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఘనపూర్ మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కార్మికులతో కలిసి వారు మాట్లాడుతూ హాస్పటల్లో పనిచేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని. అవి కూడా నెలనెలకు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలను పోషించడంలో భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు నెలనెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని. పీఎఫ్ ఈఎస్ఐ అమలులో గందరగోళం నెలకొందని ఈఎస్ఐ గుర్తింపు కార్డులు కార్మికులకు అందజేయాలని. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి.మెరుపు సమ్మెకు పిలుపునిస్తామని వారు ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు. భాస్కర్. సాయి కృష్ణ. భీమ్ రాజ్. వెంకటేష్.రంగమ్మ ప్రియాంక. పద్మ.సంగీత పాల్గొన్నారు.

ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : కలెక్టర్ అద్వైత్

విశాలాంధ్ర బ్యూరో - మహబూబాబాద్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ నేరడ, చిన్న గూడూరు, కేజీబీవీ నేరడ పాఠశా లలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఉత్తమమైన ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులని ఉత్తేజపరిచారు. విద్యార్థులు కేవలం పాస్ వరకే కాకుండా ఉన్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠ శాల పరిసర ప్రాంతాలు వంటగది, ఆహార పదార్థాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించి, పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో తీసుకోవలసిన కోర్సులు, క్యారియర్ గైడెన్సిని అందజేయాలని, ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వం వసతి గృహాల్లో అమలు చేస్తున్న మెనో చాట్ ప్రకారం ఖచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, మంచి పోషా కాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పగిడిపల్లి లలిత, స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, ఉపాధ్యాయులు, వసతి గృహ వార్డెన్ పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి : టీయూసీఐ

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని మాదారం స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో ధరావత్ సక్రు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ ఒకప్పుడు మాదారం స్టీల్ ప్లాంట్ వందలాది మందికి ఉపాధి చూపిన స్టీల్ ప్లాంట్ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాల వల్ల స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు కుటుంబాలు నడవక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గతంలో కళకళలాడిన స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం చేయడానికి కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని బడా పారిశ్రామిక వేత్త లైన అదాని, అంబానికి అప్పజెప్పడం కోసం నష్టాల పేరున దానిని దివాళి తీసే విధంగా మోడీ ప్రభుత్వం దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఇంత వరకు కార్మిక మంత్రి లేకపోవడం శోచనీయమని వెంటనే కార్మిక శాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కార్మిక సమస్యల మీద కలవడానికి వెళ్తే కార్మిక మంత్రి లేకపోవడం దారుణమని అది ముఖ్యమంత్రి దగ్గర ఉండటం వలన వారి దగ్గరకి వెళ్ళటం కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రంలో పనిచేస్తున్న హమాలీ మోటారు భవన నిర్మాణం గ్రామపంచాయతీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు.దేశ ఉత్పత్తి రంగంలో కీల కంగా మారిన కార్మికులకు చట్టబద్ధమైన హక్కు లు లేక శ్రమదోపిడి గురవుతున్నారని ఆరోపిం చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి మండల కేంద్రంలో ట్రేడ్ యూని యన్ సెంటర్ ఆఫ్ ఇండియా కార్మిక సంఘం పెద్ద ఎత్తున కార్మికుల సమీకరించి వారి హక్కుల కోసం పోరాడుతామని ఈ పోరాటాలలో కార్మికు లు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు. ఈ సమావేశంలో టియుసిఐ నాయకులు ఎస్కే పాషా, బాదావత్ వీరు, నరాటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సంపత్, రవి, ఏఐకేయూఎస్ డివిజన్ అధ్యక్షులు తేజ్య ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - (మహబుబాబాద్)తొర్రూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆత్మీయ భరోసా, రైతు భరోసా ,రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తోరూర్ డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్ లో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ లు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందన్నారు. విత్తనాలు సాగు పద్ధతుల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడు సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,ఏఎంసి డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, నాయకులు గుండాల నర్సయ్య, తాళ్లపల్లి బిక్షం గౌడ్, నల్లపు రాజు, నల్లమాస సమ్మయ్య, జలీల్,సుదర్శన్, బచ్చలి లక్ష్మణ్, ఇమ్మడి శ్రీనివాస్, వెంకన్న యాదవ్, మల్లారెడ్డి, హేమంత్, వెలుగు మహేశ్వరి, సాగర్, బంధు వెంకన్న, వై. శ్రీనివాస్, గిరిధర్,బానోతు సరేష్, మధు, అనిత, మేఘ్యు నాయక్, రమేష్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు భద్రతా ఏర్పాటు పటిష్టంగా చేసుకోవాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: జిల్లాలోని బ్యాంకుల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లను అధికారులు చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో అన్ని బ్యాంకుల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఇటీవల వరంగల్, బీదర్ ప్రాంతాల్లోని బ్యాంకులలో జరిగిన దొంగతనాలను వివరించారు. అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు తమ బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్ల సమీక్ష కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్యాంకుల లోపలే కాకుండా వెలుపల అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సెక్యూరిటీ అలారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎ టి ఎమ్ లలో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్కడ సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. కరపత్రాలను, పోస్టర్లను అతికించాలని కోరారు. ప్రభుత్వ ఇన్సూరెన్స్ స్కీములకు సంబం ధించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావే శంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, డిఎస్పీలు చంద్రభాను, అబ్దుల్ రెహమాన్, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ కొత్త ప్రచారం షురూ

ముంబై: భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటి హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ కుటుంబాలను నిర్మించడంలో, వారి భవిష్యత్తును భద్రపరచడంలో తల్లిదండ్రుల విలువల శాశ్వత పాత్రను నొక్కి చూపించే కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం కదిలే కథా ప్రసంగంతో, ప్రేమ, గౌరవం, పట్టుదల, స్వాతంత్ర్యం వంటి విలువలు ఎలా శాశ్వతమైన బంధాలను ఏర్పరుస్తాయో, అడ్డంకులను అధిగమించడంలో ఎలా కీలకమవుతాయో ఆకర్షణీయంగా చూపిస్తుంది. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ సాపేక్షమైన, స్ఫూర్తిదాయకమైన ప్రకటన చిత్రాలను రూపొందించడంలో పేరుపొందింది. ఈ తాజా ప్రచారం ఓ కొత్త దృష్టి కోణాన్ని తీసుకువస్తుంది. మారుతున్న ప్రపంచంలో, తల్లిదండ్రుల బోధనలు పిల్ల లకు మార్గదర్శక దిక్సూచిగా ఎలా పనిచేస్తాయో ఈ ప్రచారం నొక్కి చెబుతుందని హెచ్‌డి ఎఫ్‌సి లైఫ్ గ్రూప్ హెడ్‌స్ట్రాటజీ అండ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ విశాల్ సుభర్వాల్ అన్నారు.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 నిజమైన ఏఐ సహచరుడు : టిఎం రోహ్

గురుగ్రామ్: సామ్‌సంగ్ అత్యుత్తమంగా తయారు చేసిన ఉత్పత్తి గెలాక్సీ ఎస్25 అని కంపెనీ ప్రెసిడెంట్ మరియు మొబైల్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ హెడ్ టిఎం రోహ్ తెలిపారు. గెలాక్సీ ఎస్25 అనేది కెమెరా, బ్యాటరీ కోసం హార్డ్‌వేర్‌లో సాటిలేని నాయకత్వంతో వస్తున్న అతి సన్నటి, అత్యంత మన్నికైన స్మార్ట్‌ఫోన్. ఇది గెలాక్సీలో అత్యుత్తమ పనితీరు కలిగిన కస్టమైజ్డ్ ప్రాసెసర్‌ని కలిగి ఉంది. ఇప్పటికే ఎస్ సిరీస్ అత్యుత్తమ కెమెరా అనుభవంకు మరింత కలిపి సుసంపన్నం చేయబడింది. గెలాక్సీ ఏఐతో, ఏఐ-ఆధారిత చిత్ర నాణ్యత, ఇమేజ్ ఎడిటింగ్ సామర్థ్యాలు ఏర్పడతాయని ఆయన తెలిపారు. గెలాక్సీ ఎస్25లో, గూగుల్ జెమిని లైవ్ కొరియన్, ఇంగ్లీష్, హిందీలో అందించబడుతుందని రోహ్ జోడించారు. నమ్మదగిన ఏఐ ఉపయోగం కోసం సామ్‌సంగ్ ఉత్తమ రక్షణను అందిస్తుందన్నారు.

అమెజాన్ ఇండియా దిఖోగే తొ బికోగే ప్రచారం ప్రారంభం

బెంగళూరు: భారతదేశంలోని చిన్న వ్యాపారాలకు దాని డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకాలు ఎలా సరళమైనవి, ప్రభావవంతంగా ఉంటాయో అవగాహనను బలోపేతం కల్పించటానికి ‘దిఖోగే తొ బికోగే’ పేరుతో ఒక కొత్త బ్రాండ్ ప్రచారాన్ని అమెజాన్ ఇండియా ప్రారంభించింది. ఈ ప్రచారంలో మూడు సృజనాత్మక, హాస్యభరితమైన వాణిజ్య ప్రకటనలు ఉన్నాయి-ప్రతి ఒక్కటి విక్రేతలు తమ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి, విక్రయించడానికి అసాధారణ మార్గాలను తీసుకునే విభిన్న దృశ్యాన్ని చూపుతుంది. ఈ వీడియోలు విక్రేతల కోసం అమెజాన్ మార్కెట్‌ప్లేస్‌ల ప్రయోజనాలను హైలైట్ చేస్తాయి. వీటి లో విస్తృత కస్టమర్ బేస్, భారతదేశంలోని 100% సర్వీస్ చేయగల పిన్ కోడ్‌లకు చేరుకో గల అవకాశం, 18పైగా గ్లోబల్ మార్కెట్‌ప్లేస్‌లకు అవకాశాలు ఉంటాయి. ఆన్‌లైన్ అమ్మ కాలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రభావవంతంగా చేయడం ద్వారా అన్ని పరిమా ణాల వ్యాపారాలను శక్తివంతం చేయడంలో అమెజాన్ నిబద్ధతను ఈ ప్రచారం నొక్కి చెబుతుంది.

నాలుగు కొత్త టచ్ పాయింట్స్‌తో ఇసుజు మోటార్స్ ఫుట్‌ప్రింట్ విస్తరణ

చెన్నై: జపాన్‌కు చెందిన ఇసుజు మోటార్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇసుజు మోటార్స్ ఇండియా భారతదేశవ్యాప్తంగా నాలుగు కొత్త టచ్ పాయింట్స్ ప్రారంభించడంతో భారతదేశంలో తన ఫుట్‌ప్రింట్‌ను విస్తరించింది. ఇందులో ఖమ్మం (తెలంగాణ), రత్నగిరి (మహారాష్ట్రా)లలో రెండు కొత్త అధీకృత సేవా కేంద్రాలు (ఏఎస్‌సిలు)తో సహా ఇండోర్, మధ్యప్రదేశ్ పాట్నా, బీహార్ లలో కొత్త 3ఎస్ (సేల్స్, సర్వీస్ మరియు స్పేర్స్) డీలర్షిప్ ఉన్నాయి. ఈ కొత్త చేరికలతో, ఇసుజు నెట్వర్క్ భారతదేశవ్యాప్తంగా 72 ప్రదేశాలకు పెరిగింది. ఇది మా వినియోగదారులకు దగ్గరగా ఉండడము, వినియోగదారు సంతృప్తి, నిరంతరాయ యాజమాన్య అనుభవం కొరకు మా చిత్తశుద్ధిని పునరుద్ఘాటిస్తుంది. ఇండోర్ కొరకు ఇసుజు మోటార్స్ సాగర్ ఇసుజుతో, బీహార్ కొరకు ఇంపీరియల్ ఇసుజుతో చేతులు కలిపింది. ఇది బీహార్‌లోకి ఇసుజు విస్తరణను సూచిస్తుంది. బియాండ్ ఆటో కేర్‌చే ఖమ్మం ఏఎస్‌సి, ప్రైమ్ ఇసుజు ద్వారా రత్నగిరి ఏఎస్‌సి నిర్వహించబడతాయి. ప్రైమ్ ఇసుజు కొల్హాపూర్‌లో 3ఎస్ సదుపాయాన్ని కూడా నిర్వహిస్తుంది.

క్లీన్ ఇండియా మిషన్‌కు ఐటిసి వావ్ తోడ్పాటు

హైదరాబాద్: పర్యావరణ అనుకూల పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ పద్ధతుల ద్వారా పర్యావరణ నిర్వహణ, వనరుల పరిరక్షణకు తమ నిబద్ధతను బలోపేతం చేస్తూ, ఐటిసి లిమిటెడ్ ఈరోజు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో వెల్బియింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ (డబ్ల్యుఓడబ్ల్యు-వావ్) ఇంటర్‌స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఛాంపియన్‌షిప్ సమయంలో సమర్థవంతమైన రీతిలో వ్యర్థాల నిర్వహణ ద్వారా క్లీన్ ఇండియా మిషన్ లేదా స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విద్యార్థులు, పాఠశాలలు చేసిన అసాధారణ సహకారాన్ని గుర్తించి, వేడుక జరుపుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి పాల్గొనగా గౌరవ అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్య కమిషనర్, డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, ఐటీసీ లిమిటెడ్-పేపర్‌బోర్డ్స్-స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పొన్నూరు పాల్గొన్నారు.

లగ్జరీ స్కిన్‌కేర్ ఉత్పత్తులలో మరువా-సరితా హండా కొత్త ప్రయాణం

న్యూఢిల్లీ: అందాన్ని అన్వేషించడమనేది పర్యావరణ పరిరక్షణ కోసం అన్వేషణతో ఎక్కువగా సమలేఖనం అవుతున్న యుగంలో, మరువా అండ్ సరితా హండా భాగస్వామ్యం లగ్జరీ, వెల్‌నెస్‌ను పునర్నిర్వచించే ప్రామాణికమైన, మార్గదర్శక సహకారంగా ఉద్భవించింది. ఇది వెల్‌నెస్ రంగంలోకి సరితా హండా మొదటి ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఆఫ్రికన్ వృక్షశాస్త్ర చర్మ సంరక్షణలో తమ నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన బ్రాండ్ మరువాతో చేతులు కలిపింది. గీతా, ఆశిష్ చౌదరి స్థాపించిన మరువా, స్వదేశీ ఆఫ్రికన్ మొక్కల సహజ శక్తిని ఉపయోగించుకోవడంలో దాని అంకితభావానికి ప్రసిద్ధి. మరువా సహ వ్యవస్థాపకురాలు గీతా చౌదరి మాట్లాడుతూ, మరువాలో మా లక్ష్యం, కళాకారులకు అవకాశాలను సృష్టించడం ద్వారా వారికి సాధికారత కల్పించడమేనని అన్నారు.

భారత ఫుట్‌బాల్‌ను మారుస్తున్న డేటా ఇంటెలిజెన్స్

విశాలాంధ్ర- హైదరాబాద్: భారత ఫుట్‌బాల్‌కు ఆటను మార్చే పరిణామంలో, దేశంలో క్రీడ పర్యావరణ వ్యవస్థను మార్చడానికి డేటా ఇంటెలిజెన్స్ ఖచ్చితమైన అప్లికేషన్ సిద్ధంగా ఉందన్నారు. జర్మనీలోని ఫుట్‌బాల్ పాలక సంస్థ డ్యూషర్ ఫుట్‌బాల్-బండ్ ప్రపంచ సాంకేతిక మార్గదర్శకులు డిజిటల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం నుండి ఈ ప్రతిష్టాత్మక చొరవ ఉద్భవించిందన్నారు. ఫుట్‌బాల్ ఔత్సాహికులకు మెరుగైన వీక్షణ అనుభవాన్ని భారతీయ ఫుట్‌బాల్ అభిమానులు ఆస్వాదిస్తారన్నారు. ఇది ఫుట్‌బాల్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో, విభిన్న ప్రేక్షకులకు ఆకర్షణీయంగా మార్చడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుం దన్నారు. పరిశ్రమ నాయకులు డి ఎఫ్ బి మీడియా రైట్స్ డైరెక్టర్ కె.డామ్‌హెూల్జ్, ఇండియా ఫుట్‌బాల్ సెంటర్ వ్యవస్థాపకుడు కౌశిక్ మౌలిక్, టీసీజీ డిజిటల్ సీఈవో దేబ్‌దాస్ సేన్, డిజిటల్ గ్లోబల్ మార్కెటింగ్ హెడ్ కీయా ఛటర్జీ ఉన్నారు. మీరన్ (కేరళ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు-డైట్‌మార్ బీర్స్‌డోర్ఫర్, గెర్హార్డ్ రీడ్ల్ (వ్యవస్థాపకుడు-ఇండియన్ ఫుట్‌బాల్ సెంటర్, ఆస్ట్రియా), జర్మనీలోని భారతీయ సోదరభావం నుండి కీలక ప్రతినిధులు ఉన్నారు.

ఫిబ్రవరి 9న తెలంగాణ ఫిట్‌నెస్ ఫెస్టివల్

హైదరాబాద్: గూగీ గ్రూప్ ప్రెజెంట్స్ తెలంగాణ ఫిట్‌నెస్ ఫెస్టివల్ హైదరాబాద్‌లోని ఎల్ బీ అవుట్‌డోర్ స్టేడియంలో ఫిబ్రవరి 9న ప్రారంభమవుతుంది. కాగా, తెలంగాణ ఫిట్‌నెస్ ఫెస్టివల్ బై షఫీ సామి పోస్టర్‌ను తాజాగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఇంచార్జ్ ఉస్మాన్ అల్హజ్రీ, మలక్‌పేట్ ఇంచార్జ్ షేక్ అక్బర్ పాల్గొన్నారు.

బీఎండబ్ల్యు ఎక్స్3 భారతదేశంలో విడుదల

ముంబయి: ఆల్-న్యూ బీఎండబ్ల్యు ఎక్స్3 ఆటో ఎక్స్‌పో 2025 రెండవ రోజున భారత దేశంలో ప్రారంభించబడింది. స్థానికంగా బీఎండబ్ల్యు గ్రూప్ ప్లాంట్ చెన్నైలో ఉత్పత్తి చేయబడిన ఈ స్పోర్ట్స్ యాక్టివిటీ వెహికల్ దేశంలో పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రెయిన్‌లలో అందుబాటులో ఉంటుంది. ఆల్-న్యూ బీఎండబ్ల్యు ఎక్స్3ని భారతదేశంలోని బీఎండబ్ల్యు డీలర్‌షిప్‌లలో, బీఎండబ్ల్యు.ఇన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 2025 నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని బీఎండబ్ల్యు గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ విక్రమ్ పవా తెలిపారు. వీటి ధర రూ.75,80,000, రూ.77,80,000కు లభిస్తాయి.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా పెవిలియను సందర్శించిన ప్రధాని మోడీ

హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా పెవిలియన్‌ను సందర్శించారు. డ్రైవ్. ఫ్యూచర్, భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా డైరెక్టర్ పార్థ్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సీఈఓ ఎమెరిటస్ రాజీవ్ చాబా సగర్వంగా ఎంజీ కొత్త-యుగం వాహనాలు, స్థిరమైన చలనశీలత, స్మార్ట్ అధునాతన ఆవిష్కరణలను ప్రదర్శించారు.

బుధవారం
29-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 128
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ట్రంప్ బాటలో కెనడా నేత రూబీ ధల్లా

ఒట్టావా : కెనడా ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు జస్టిన్ ట్రూడో ప్రకటించడంతో తదుపరి ప్రధాని ఎన్నిక ఆసక్తిగా మారింది. ఇందుకోసం లిబరల్ పార్టీ తరఫున పోటీ పడుతున్న వారిలో భారత సంతతి వ్యక్తుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ జాబితా నుంచి అనితా ఇందిరా ఆనంద్ వైదొలగనున్నట్లు ఇటీవల ప్రకటించగా... తాజాగా రూబీ ధల్లా పార్టీ నాయకురాలి రేసులో చేరిపోయారు. తాను ప్రధానిగా ఎన్నికయితే అక్రమ వలసదారులను బహిష్కరిస్తానని హామీ ఇస్తూ ఆన్‌లైన్‌లో ప్రచారం మొదలుపెట్టారు. 1970ల్లో కెనడాకు వలసవెళ్లిన ఓ పంజాబీ కుటుంబంలో రూబీ జన్మించారు. భిన్న కుటుంబ నేపథ్యమున్న రూబీ... అందాల పోటీలు, నటన, వ్యాపార తదితర రంగాల్లో తనదైన ముద్ర వేశారు.

31 నుంచి పార్లమెంటు

న్యూదిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 31న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. మంగళవారం

- మిగతా 5 లో

దిల్లీ సీఎం ఆతిశీకి ఊరట

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి ఆతిశీకి ఊరట లభించింది. ఆమెపై బీజేపీ నేత దాఖలు చేసిన పరువు నష్టం కేసును రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. బీజేపీ మొత్తాన్ని ఉద్దేశించి ఆతిశీ మాట్లాడారు తప్ప ఎవరో ఒక్క వ్యక్తిని ఉద్దేశించి కాదని తీర్పునిచ్చింది. బీజేపీకి చెందిన కొందరు తమ పార్టీ నాయకులను ఆశ్రయించారని, కాషాయ గూటికి చేరుకోకుంటే నెలరోజుల్లోగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ద్వారా అరెస్టు చేయిస్తామని బెదిరించారని ఆతిశీతో పాటు ఆప్ నేతలు

- మిగతా 5 లో

రైతుల డిమాండ్లన్నీ పరిష్కరిస్తేనే...

చండీగఢ్: తమ డిమాండ్లన్నీ పరిష్కారమయ్యేంత తరకు ఆమరణ దీక్షను విరమించేది లేదని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ పునరుద్ఘాటించారు. ఫిబ్రవరి 14న చర్చలు జరిపేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించడంతో వైద్యం అందుకునేందుకు మాత్రమే అంగీకరించానన్నారు. దలేవాల్ దీక్ష 64వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ఖనౌరీ వద్ద సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ఖనౌరీ సరిహద్దుకు తరలి వచ్చి రైతుల ఉద్యమం 2.0

- మిగతా 5 లో

సంక్షేమమే మా విధానం

ఉత్తమ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా' స్కూళ్లు
విద్యకు అధిక ప్రాధాన్యత: భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజా సంక్షేమమే తమ విధానమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఒక్కరికి ఇల్లు, విద్య, ఉపాధి ఉండాలన్నదే లక్ష్యమని చెప్పారు. 'ప్రజాస్వామ్యంపై, ఫెడరల్ వ్యవస్థపై, రాజ్యాంగంపై విశ్వాసంతో ముందుకెళుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో బలమైన సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నప్పటికీ విధానపరమైన అంశాలపై పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. నెహ్రూ ఆర్థిక విధానమే తమ విధానం కూడా అన్నారు. సంపద లేకపోతే సంక్షేమం సాధ్యం కాదని చెప్పారు. మౌలిక వసతులు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయలేమని, అవి లేకుండా సంపదను సృష్టించలేమని భట్టి విక్రమార్క అన్నారు. ఇండస్ట్రియల్ క్లస్టర్లు నిర్మించి సంపదను పెంచి సంక్షేమం కోసం ఖర్చు చేస్తామన్నారు. దేశంలో తలసరి ఆదాయాన్ని లెక్కించే విధానం సరిగా లేదని, సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా తగిన విధంగా రాష్ట్ర సంపదను అర్హులైన పేదలకు పంచుతామని తెలిపారు. రాష్ట్రంలో ఇల్లు... విద్యా... ఉపాధి దొరకకుండా ఎవరూ ఉండరాదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు.

ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో రాజకీయ పార్టీగా తాము చేసిందేమీ లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వచ్చాయని, నాటి మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదైందని... శాఖపరంగా విచారణ జరుగుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విషయంలో తమ అభిప్రాయాలను ఎవరైనా దర్యాప్తు సంస్థల ముందుకు వచ్చి తెలియజేయవచ్చన్నారు. చెన్నైలోని ప్రముఖ సంస్థ విద్యా రంగంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క అక్కడి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. తెలంగాణలో గురుకుల విద్యా వ్యవస్థ సుదీర్ఘంగా ఉందని, రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలన్నారు. తమ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర ఉద్యమానికి ప్రచారం కోసం యంగ్ ఇండియా పత్రికను గాంధీ స్థాపించారని గుర్తుచేస్తూ అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కులం, మతం, ప్రాంతం భేదం లేకుండా ఈ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 20-25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200కోట్లతో ఒక్కో పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. బోధనా సిబ్బంది మొత్తం పాఠశాలలో ఉండేలా వసతి సౌకర్యాలు ఏర్పాటు

- మిగతా 5 లో

దావోస్ ఒప్పందాలు అతిపెద్ద విజయం

రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు: సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: తమ ప్రభుత్వం సాధించిన విజయాలలో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. 'ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి' అని ఆయన వివరించారు.

పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ అంటేనే... బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'గత ఏడాది దావోస్ సదస్సులో రూ.40 వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని నైపుణ్య కల్పనకు కూడా ఇస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా సింగపూర్‌తో ఒప్పందం చేసుకున్నాం. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చింది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందిస్తాం' అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

ఎకో టూరిజానికి చర్యలు: రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర- హైదరాబాద్: రాష్ట్రంలో టెంపుల్, హెల్త్, ఎకో టూరిజం అభివృద్ధి తక్షణం అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా టెంపుల్, ఎకో టూరిజమే రాష్ట్రానికి గుర్తింపుతో పాటు ఆదాయం పెరగడానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. చిలుకూరులోని ప్రొద్దుటూరు వెస్టన్ సెంటర్‌లో ఎక్స్‌పీరియం పార్క్‌ను రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మంచి ఎకో టూరిజం పార్క్‌ను ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లిందని వివరించారు. దేవాలయ దర్శనాలకు, అటవీ సంపదను చూసేందుకు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నామని తెలిపారు. రామప్ప, వేయిస్తంభాల గుడి వంటి అద్భుత

- మిగతా 5 లో

ఇసుక సరఫరాపై నలుగురితో కమిటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుకను ఏవిధంగా సరఫరా చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ప్రయోగాత్మక కార్యక్రమాల కమిషనర్ శశాంక్, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ ఉన్నారు. వారంలోగా అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక సమర్పించాలని కమిటీకి సీఎం ఆదేశాలిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా కోసం రాష్ట్ర సచివాలయంలో రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత రావడం లేదని, వినియోగదారులు ఎక్కువ ధరకే

- మిగతా 5 లో

కమ్యూనిజం అజేయం

కూనంనేని సాంబశివరావు

చేవెళ్ల: భూమి, ఆకాశం ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. కుల, మత భేదాలు లేని సమాజం కోసం... అంతిమంగా సోషలిస్టు సమాజం కోసం తమ ప్రయాణం కొనసాగుతుందని చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. తొలుత సీపీఐ జెండాను కూనంనేని ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గానీ, తెలంగాణ సాయుధ పోరాటంలోగానీ కమ్యూనిస్టుల పాత్రను విస్మరించలేరని చెప్పారు. కార్మికుడికి కష్టం వచ్చినా... పేదవాడికి ఇబ్బందులు కలిగినా గుర్తొచ్చేది ఎర్రజెండా మాత్రమేనని ఆయన అన్నారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకులు ధరలు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెంపునకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులే పోరాటాలు కొనసాగిస్తారన్నారు. సామాన్యులు, మధ్యతరగతికి అండ ఎర్రజెండా అన్నారు.

అధికారం శాశ్వతం కాదని, దాని కోసం ఆరాటం సీపీఐ లక్ష్యం కాదన్నారు. సోషలిస్టు సమాజం ఏర్పాటు కోసం ప్రజల్ని చైతన్యవంతం చేయడం, ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయడం తమ ప్రధాన కర్తవ్యమని కూనంనేని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కారుచౌకగా విక్రయిస్తోందని, మరోపక్క యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలంటూ కల్లబొల్లి మాటలు చెబుతోందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్‌రెడ్డి, వివిధ మండలాల పార్టీల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర- హనుమకొండ: పద్మ అవార్డులు బీజేపీ అవార్డులు కాదని, అవి జాతీయ అవార్డులని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. పద్మ అవార్డులలో కేంద్ర

- మిగతా 5 లో

నేడు నింగిలోకి జీఎస్‌ఎల్వీ ఎఫ్15

- ఉదయం 06.23 నిమిషాలకు రాకెట్ ప్రయోగం
- ఇస్రో నూతన చైర్మన్ నేతృత్వంలో సెంచరీకి సిద్ధం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట : భారత అంతరిక్ష కార్యక్రమంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి 100వ ప్రయోగానికి సిద్ధమయింది. జనవరి 29వ తేదీ బుధవారం ఉదయం 6.23 గంటలకు జీఎస్‌ఎల్వీ ఎఫ్15 మిషన్ ద్వారా ఎన్వీఎస్ 02 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనుంది. ఇది భారత స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ నావిక్ అభివృద్ధికి దోహదపడుతుంది. జీఎస్‌ఎల్వీ ఎఫ్15 మిషన్ జీఎస్‌ఎల్వీకు చెందిన 17వ ప్రయాణం. స్వదేశీ క్రయోజెనిక్ దశను కలిగిన 11వ ప్రయోగం. ముఖ్యంగా ఇది పూర్తి స్వదేశీ క్రయోజెనిక్ దశతో జరిగిన ఎనిమిదవ ఆపరేషనల్ ప్రయోగం. ఇస్రో సాంకేతిక నైపుణ్యాన్ని

- మిగతా 5 లో

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన జాన్ వెస్లీ ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నాలుగు రోజులుగా జరిగిన సీపీఎం మహాసభల్లో భాగంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీని ఎన్నుకున్నారు. వనపర్తి జిల్లా అమరచింత ఆయన స్వస్థలం. గతంలో డీవైఎఫ్ఐ, కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యకు సేవలు అందించారు. కాగా, సీపీఎం చరిత్రలో తొలిసారి ఒక దళితుడిని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడిగా జాన్ వెస్లీ ఉన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం నియమితులయ్యారు. అపై వరుసగా రెండు సార్లు ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లాలో అంచెలంచెలుగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగిన తమ్మినేని వీరభద్రంకు వయస్సు మీద పడటంతో ఆయనను పదవీ బాధ్యతల నుంచి తప్పించారు. అలాగే సీనియర్ నేతలు సీతారాములు, నర్సింగరావును తొలగించారు. 70 ఏళ్లు దాటిన నేతలను తొలగిస్తూ మహాసభల్లో నిర్ణయం తీసుకున్నారు.

రైతుబంధు బంద్‌కు కుట్ర

మాజీ మంత్రి కేటీఆర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం నల్లగొండ లోని గడియారం సెంటర్ లో బీఆర్‌ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేసీఆర్ హయాంలో ఒకే విడతలో రైతుబంధు కింద రైతుల ఖాతాలో రూ. 73 వేల కోట్లు జమచేసినట్లు గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ అంటే వైఎస్ఆర్ అని, రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తొస్తా రని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారని, కుట్రలో భాగంగానే కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని బందు చేయాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎకరానికి రూ. 12 వేలు ఇస్తూ మోసం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కొక్క ఎకరానికి రూ.17,500 బాకీ ఉందని, ఆ డబ్బుచెల్లించాలని కాంగ్రెస్‌ను రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు. సాయుధ తెలంగాణ పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని, రైతుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిల దీసేందుకు మరోసారి నల్లగొండ

- మిగతా 5 లో

ఇదీ లోకం!

మన్యంలో మద్యం దోపిడీ

- షాపుల్లో ప్రతి క్వార్టర్‌పై రూ.10 అదనపు భారం
- బెల్టు షాపులు మరో రూ.10 వసూలు
- వెరసి ఎమ్మార్పీపై రూ.30 నుంచి 50 అదనం

విశాలాంధ్ర-రంపచోడవరం (అల్లూరి జిల్లా) : మద్యం ప్రియుల నెత్తిన భారం పడింది. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీని తప్పుపడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సరికొత్త మద్యం పాలసీ అభాసుపాలయింది. తొలుత అన్ని రకాల మద్యం ధరలను నియంత్రించి, నాణ్యమైన మద్యాన్ని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావటం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన మద్యం పాలసీ విధి విధానాల ఫలితంగా మద్యం ప్రియులకు తాగకుండానే కిక్కేస్తుంది అంటే అతిశయోక్తి కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలకు ఒక్కొక్కటిగా తూట్లు

పొడుస్తోందన్న విమర్శల నడుమ... వైసీపీ ప్రభుత్వంలో ఉన్న బూమ్ బూమ్‌లు పోకపోగా... మద్యాన్ని మరింత ప్రియం చేయడంపై మందు బాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం వ్యాపారులకు ప్రభుత్వం ముందు ప్రకటించిన లాభాల శాతాన్ని తగ్గించి ఇచ్చిన హామీని తుంగలో

- మిగతా 5 లో

సాయుధ పోరాట సేనానులు - 1

స్వాతంత్ర్యానంతరం 1951-52లో జరిగిన మొట్టమొదటి సార్వజనిక ఎన్నికల తరవాత 1952 ఏప్రిల్ 17న లోక్‌సభ మొట్టమొదటి సమావేశం జరిగింది. అప్పుడు పార్లమెంటు భవనంలోకి తొలి అడుగు పెట్టింది అప్పటి ప్రధానమంత్రి పండిత్ నెహ్రూ కాదు... సర్దార్ పటేలూ కాదు. ఆ ఎన్నికలలో అందరికన్నా ఎక్కువ ఓట్లు సంపాదించిన రావి నారాయణ రెడ్డి పార్లమెంటు భవనంలోకి అందరికన్నా ముందు అడుగు పెట్టారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

గద్దర్‌పై విమర్శలు సిగ్గుచేటు

వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర

5 లో

సంపాదకీయం

వక్ఫ్ బిల్లుపై బుల్డోజర్

ప్రజాస్వామ్యంలో, పార్లమెంటరీ సంప్రదాయాలలో మోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఎంత మాత్రం విశ్వాసం లేదని మరోసారి రుజువైంది. ప్రతిపక్షాల వాదన వినిపించుకునే అలవాటు బీజేపీకి ఎన్నడూ లేదు. వక్ఫ్ చట్టానికి సవరణల బిల్లును కూలంకశంగా పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీనైతే ఏర్పాటు చేశారు. కానీ అందులో ప్రతిపక్ష స్వరానికి ఇసుమంత విలువైనా లేకుండా పోయింది. ఈ కమిటీ నివేదిక ఖరారైంది. ప్రతిపక్షాల మాట వినే ప్రసక్తే లేదు కనక ఈ నివేదిక బుధవారం ఖరారై పోతుంది. ఆ నివేదిక ఆధారంగానే పార్లమెంటులో బిల్లుపై చర్చ జరుగుతుంది. సంయుక్త పార్లమెంటరీ కమిటీలోనే ప్రతిపక్షాల మాట వినిపించుకోనప్పుడు పార్లమెంటులో జరిగే చర్చలో ప్రతిపక్షాల అభిప్రాయం అరణ్య ఘోషగానే మిగిలిపోక తప్పదు. ఈ కమిటీలో అధికార పక్షం అంటే బీజేపీ, ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాలకు చెందినవారు 16 మంది ఉంటే ప్రతిపక్షానికి చెందిన వారు 10 మంది ఉన్నారు. మెజారిటీ నిర్ణయమే చెల్లుతుందన్నది ఎంత నిజమైనా ప్రత్యర్థుల మాట వినే సంస్కారం కూడా ఈ కమిటీలోని మెజారిటీ సభ్యులకు, దాని అధ్యక్షుడు జగదంబికా పాల్ కు లేకుండా పోయింది. కమిటీ సమావేశాలలో దాదాపు 500 సవరణలు వచ్చాయి. ఇందులో ముఖ్యం అనుకున్న 44 సవరణల మీద చర్చ జరిగింది. 32 సవరణలను, అదీ ఎన్.డి.ఎ. సభ్యులు ప్రతిపాదించిన సవరణలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతిపాదిత బిల్లులో "వక్ఫ్ బై యూజర్" అన్న మాట ఉంది. అంటే దీర్ఘ కాలికంగా మతపరమైన ప్రయోజనాలకు వినియోగించే ఆస్తులు అన్న అర్థం. దీనివల్ల తరతరాల నుంచి ఉన్న మతపరమైన నిర్మాణాలకు ముప్పు ఏర్పడుతుందన్న భయాందోళనలు వినిపించాయి. ఈ మాటలో స్వల్ప మార్పును మాత్రం అంగీకరించారు. అయితే వివాదంలో ఉన్న లేదా ప్రభుత్వ ఆవరణల్లో ఉన్న వాటిని మాత్రం మినహాయిస్తారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీల ఏర్పాటులో ప్రతిపాదిత బిల్లుపై కూలంకశమైన చర్చ జరగడం మాత్రమే ప్రధాన ఉద్దేశం కాదు. ప్రతిపక్షాల వాదన కూడా వినిపించడానికి ఎక్కువ అవకాశం ఉండడం కూడా మరో లక్ష్యం. అయితే ఈ సంయుక్త పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్షాల మాటను చెవిన పెట్టిన ఆనవాళ్లే లేవు. కమిటీ ఆమోదించిన సవరణల్లో మరో ముఖ్యమైన సవరణ ప్రభుత్వానికి చెందిన ఆవరణల్లో ఉన్న వక్ఫ్ ఆస్తులపై వివాదం ఏర్పడితే ఇప్పటిదాకా జిల్లా కలెక్టర్లు విచారించే వారు. ఇప్పుడు అది ఉండదు. కలెక్టర్ కన్నా ఎక్కువ స్థాయిలో ఉండే అధికారులు విచారించే అవకాశం కల్పించారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించాలన్న ప్రతిపాదన ఈ బిల్లులో ఉంది. దీనిని కమిటీలోని ముస్లిం సభ్యులు గట్టిగా వ్యతిరేకించినా మెజారిటీ నిర్ణయం కింద ఈ ప్రతిపాదనను ఆమోదించేశారు. వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు ముస్లిమేతరులను నియమించాలన్నది బిల్లులో ఉన్న ప్రతిపాదన. అయితే ఎక్స్ అఫీషియో సభ్యులు కూడా ఉంటారు కనక ఆ ఖాతాలో మరో ఇద్దరు ముస్లిమేతరులను, అంటే నలుగురు ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డ్ సభ్యులుగా నియమించే అవకాశం ఉంటుంది. దీన్నిబట్టి ప్రభుత్వం వక్ఫ్ బిల్లును మత వ్యవహారమైన అంశంగా కాకుండా కేవలం ఆస్తులకు సంబంధించిన విషయంగా పరిగణిస్తోంది.

ఈ బిల్లులో ఉన్న 44 క్లాజులకు ప్రతిపక్ష సభ్యులు సవరణలు ప్రతిపాదించారు. 1995 నాటి చట్టానికి అనుగుణంగా ఉండడం కోసం 28 క్లాజులను తొలగించాలని కూడా ప్రతిపక్షాలు కోరాయి. ఆగాఖానీ ముస్లిల, దావూదీ బోహ్రా ముస్లింల ఆస్తులకోసం ప్రత్యేక వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిని ప్రతిపక్షాలూ వ్యతిరేకించినా ఫలితం లేకపోయింది. ఈ బిల్లులోని 40వ క్లాజు ప్రకారం ముస్లింలు కాని వారు కూడా వక్ఫ్‌కు విరాళంగా ఆస్తులు ఇవ్వవచ్చు అని 1995నాటి చట్టంలో ఉంది. దీన్ని ప్రభుత్వం తొలగించాలనుకుంటోంది. దీన్ని తొలగించకుండా ప్రతిపక్ష సభ్యులందరూ ప్రతిపాదించిన సవరణలన్నీ వీగిపోయాయి. తమ వాదన వినిపించడానికి సరైన అవకాశం ఇవ్వలేదని ప్రతిపక్షానికి చెందిన 11 మంది సభ్యులు ఒక సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ అధ్యక్షుడు క్లాజుల వారీగా చర్చకు అవకాశం ఇవ్వలేదని కూడా ఈ ప్రకటనలో ఆరోపించారు. ఈ కమిటీ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించిన వారిలో 95 శాతం మంది ఈ బిల్లును వ్యతిరేకించారు. ఆ వాదనలూ ఎన్.డి.ఎ.కు ఉన్న మెజారిటీ ముందు గాలికి కొట్టుకు పోయాయి. ఇంకా విచిత్రం ఏమిటంటే దిల్లీలోనూ, ఇతర చోట్ల సం యుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల మినిట్స్‌ను కూడా సభ్యులకు అందించలేదు. కమిటీ అధ్యక్షుడు జగదంబికా పాల్ సమావేశాలను నిర్వహించిన తీరు విచిత్రంగా ఉంది. సవరణలు ప్రతిపాదించిన పేర్లు మాత్రం చెప్పి వారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఆ సవరణలను చదివి వినిపించి పనై అయిపోయిందనిపించారు. ఆ సవరణలను తానే ప్రతిపాదించారు. వీటిని ఎంతమంది వ్యతిరేకించారో, ఎందరు అనుకూలంగా ఉన్నారో ఆయనే ఏకపక్షంగా నిర్ణయించేశారు. సవరణలను తోసిపుచ్చినట్టు ప్రకటించేశారు. అందువల్ల మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడానికి ప్రతిపక్షాల సభ్యులు చేసిన ప్రయత్నాలు ఎందుకూ కొరగాకుండా పోయాయి. వక్ఫ్ చట్టం సవరించడానికి బిల్లును పరిశీలించడానికి గత ఏడాది ఆగస్టు 9న సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేశారు. 36 సార్లు ఈ కమిటీ సమావేశమైంది. దాదాపు 111 గంటలపాటు చర్చలు జరిగాయి. ఈ కమిటీ 25 వక్ఫ్ బోర్డుల ప్రతినిధులను సంప్రదించింది. 15 రాష్ట్రాల ప్రభుత్వాలతోనూ చర్చించింది. వక్ఫ్‌లతో సంబంధం ఉన్న వారు 92.28 లక్షల ఈ మెయిళ్ల ఈ కమిటీకి పంపించారు. అంటే ఈ బిల్లుపై ఆసక్తి ఎంత విస్తారంగా ఉదో తెలుసుకోవచ్చు. కానీ మెజారిటీ ఉన్న ఎన్.డి.ఎ. సభ్యుల మాటే సకల విషయాలలోనూ నెగ్గింది. ఢిల్లీ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి కనక ముస్లిం ఓట్లను ఆకర్షించాలన్న ఆతృతతోనే ఆదరాబాదరా సిఫార్సులకు ఆమోదముద్ర వేయించారు. ఈ బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే ఇందులో ఒక కేంద్ర మంత్రి, ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఇతరులు సభ్యులుగా ఉంటారు. వీరు ముస్లింలు కావాలన్న నియమేమీ లేదు. ఇతర మతాల వారిని వక్ఫ్ బోర్డుల్లో జొప్పించడానికే ఈ బిల్లులో ఈ అవకాశం కల్పించారు. ఇక మీదట ముస్లింలు మాత్రమే వక్ఫ్ బోర్డులకు విరాళాలివ్వాలి. అది కూడా అయిదేళ్ల నుంచి తాము ముస్లిం మతాచారాలను పాటిస్తున్నామని రుజువు చేసుకోవాలి. వెరసి తేలిందేమిటంటే తనకు ఉన్న మెజారిటీ ఆధారంగా ఏ విషయాన్ని అయినా బలవంతంగా ఆమోదింప చేసే అవకాశం ప్రభుత్వానికి దక్కింది. బుల్డోజర్ రాజకీయాలు ఇంతకన్నా భిన్నంగా ఎందుకు ఉంటాయిగనక!

వర్సిటీలపైనా కేంద్రం కన్ను

రమణయ్య జి

విద్యా రంగంపైన మరో దాడితో 2025వ సంవత్సరం ప్రారంభమైంది. మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ద్వారా కొత్త నిబంధనల ముసాయిదా విడుదల చేసింది ('యూనివర్సిటీలు, కాలేజీలలో టీచర్లు, అకడమిక్ సిబ్బంది నియామకం ప్రమోషన్ ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణకు కనీస అర్హతలు' పేరిట). దేశంలోని ఉన్నత విద్యా సంస్థలపై అదుపు పెంచుకోవడంకోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మరో ప్రయత్నమిది. యూజీసీ చెప్పే ప్రకారం దేశంలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 481 రాష్ట్రాల యూనివర్సిటీలు వున్నాయి. ఈ నిబంధనల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల యూనివర్సిటీలకు కూడా నియామకాలు చేసేందుకు, వాటి నిర్వహణ ఎలా వుండాలో సూచించే పేరుతో హక్కులను కబళించేస్తున్నది. దేశంలోని అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం ఎలా జరగాలో ఈ ముసాయిదా నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. వీసీల పరిశీలన, ఎంపిక కమిటీల ఏర్పాటు నిబంధనలను మార్చడాన్ని ఈ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

ప్రస్తుతం ఈ కమిటీలలో ముగ్గురు సభ్యులు-యూజీసీ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనగా ఛాన్సలర్ ప్రతిపాదించిన సభ్యులు, యూనివర్సిటీ సిండికేట్-సెనేట్/ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ప్రతినిధి వుంటున్నారు. కొత్త ముసాయిదా చెబుతున్న మార్పులు కేంద్ర ప్రభుత్వానికి మొగ్గు చూపేవిగానూ రాష్ట్ర ప్రభుత్వానికి ఏ పాత్ర లేకుండా చేసేవిగానూ వున్నాయి. ఇది నియామకాలను కేంద్రం చేతుల్లో పెట్టడమే గాక బీజేపీ, ఆరెస్సెస్, వీహెచ్‌పీకి అనుకూలమైన వ్యక్తులను యూని వర్సిటీల వీసీలుగా రుద్దేందుకు ఉద్దేశించాయి. కేరళలో గవర్నర్ పరిశీలన, ఎంపిక కమిటీ సిఫార్సులను తోసిరాజని ఆరెస్సెస్ అనుకూల వ్యక్తిని వైస్ ఛాన్సలర్‌గా నియమించడం ఇప్పటికే మనం చూశాం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) భారతీయ విద్యావ్యవస్థ కేంద్రీకృతం, వ్యాపారాత్మకం చేయడానికి బాట వేసింది. విద్యా వ్యవస్థలో ప్రధమ భాగస్వాములైన అధ్యాపకులు, విద్యార్థులు సరైన రీతిలోనే దాన్ని వ్యతిరేకించారు. ఎన్ఈపీ విధాన నిర్దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఈ కొత్త నిబంధనల ముసాయిదా ముందుకు వచ్చింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలపై ఉమ్మడి ఎజెండా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నది. రాష్ట్రాల చేతుల్లోని ముఖ్యమైన స్థానాలన్నిటినీ వశపర్చుకోవడంలో భాగంగా సరైన అర్హతలు లేకున్నా హిందూత్వ భావజాలం గల వ్యక్తులను నియమించడం ప్రారంభించింది. తాను అధికారంలో లేని రాష్ట్రాలలో ఇందుకోసం గవర్నర్లను ఉపయోగిస్తున్నది. తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌తో పాటు కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం కూడా ఈ విధంగా గవర్నర్లు యూనివర్సిటీల నిర్వహణలో, నియంత్రణలో జోక్యం చేసుకోవడాన్ని ప్రతిఘటించింది. గవర్నర్లు సాగిస్తున్న ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు చట్టబద్ధమైన విలువ కల్పించేందుకే ఈ ముసాయిదా నిబంధనలు వచ్చాయి.

పాక్షిక ప్రయోజనాల కోసం గవర్నర్ల స్థానాన్ని విచ్చలవిడిగా ఉపయోగించుకోవడం జరుగుతున్నది. ప్రతిపక్షాలు పాలన చేస్తున్న చోట్ల ఆ ప్రభుత్వాల పాలన సజావుగా సాగకుండా వీరు ప్రతిబంధకాలవుతున్నారు. గవర్నర్లలో చాలా వరకూ కేంద్రంలోని పాలక పార్టీ ఏజంట్లే. తాజా నిబంధనల జారీలో కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమీక్ష కోసం నియమించిన రెండు కమిషన్ల సిఫార్సులను అనుసరించింది లేదు. సహజంగానే ఇలాంటి సిఫార్సులు బీజేపీ ప్రభుత్వానికి మింగుడుపడేవి కావు. బీజేపీ సైద్ధాంతికంగా కూడా సమాఖ్య భావనకు వ్యతిరేకంగా కేంద్రీకరణ కోరుకుంటుంది. అందువల్లనే అది కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కమిషన్లు చేసిన సిఫార్సుల అమలు కోసం గవర్నర్ల అధికారాలు తగ్గించడంపై ఆసక్తి చూపించదు. ఈ ముసాయిదాలో అత్యంత కర్కోటకమైన భాగం ఏమంటే ఈ నిబంధనలు అమలు చేయని రాష్ట్రాలు లేదా మరే ఇతర వ్యవస్థలపై శిక్షా చర్యలు నిర్దేశించడం. అలాంటి సంస్థలను యూజీసీ పథకాల్లో పాలు పంచుకోకుండా బహిష్కరించాని ఈ ముసాయిదా చెబుతున్నది. యూజీసీ చట్టం కింద నిర్వహించే ఉన్నత విద్యాసంస్థల జాబితా నుంచి అలాంటి వాటిని తొలగించాలంటున్నది. క్లుప్తంగా చెప్పాలంటే తన ఆదేశాలకు లోబడి వుండాలని యూనివర్సిటీలకు యూజీసీ నిర్దేశిస్తున్న నిర్బంధ చర్యే ఇది. ప్రధానంగా వివిధ యూనివర్సిటీలకు నిధులు పంపిణీ చేసేందుకు మాత్రమే యూజీసీ ఉద్దేశించింది తప్ప వాటిపై పెత్తనం చేసేందుకు కాదు.

ఆ ముసాయిదాలో ఇంకా ముఖ్యమైన సిఫార్సులున్నాయి. అవి కూడా ఉన్నత విద్య, ఆరోగ్యానికి హాని కలిగించేవే. ఈ నిబంధనల ద్వారా యూజీసీ నాన్ అకడమిక్ వ్యక్తులను కూడా వైస్ ఛాన్సలర్లుగా నియమించడాన్ని చట్టబద్ధం చేసుకోవాలనుకుంటున్నది. గతంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వీసీలుగా నియమితులైన సందర్భాలు మనకు తెలుసు. ఇప్పుడీ నిబంధనలు పరిశ్రమలకు సంబంధించిన వారిని కూడా వీసీలుగా నియమించేందుకు అనుమతినిస్తున్నాయి. ఇది యూనివర్సిటీల అకడమిక్ స్వభావాన్ని దెబ్బతీసి వాటిని పరిశ్రమలకు, ప్రత్యేకించి ప్రైవేటు రంగానికి తోకలుగా మార్చేందుకు జరుపుతున్న దాడి ఇది. అంతేగాక దేశంలో స్థాపించిన ప్రైవేటు యూనివర్సిటీలకు అకడమిక్ వ్యక్తులనే వీసీలుగా నియమించాలనే చింత లేకుండా స్వేచ్ఛ కల్పించే చర్య. ఇది ప్రైవేటు యూనివర్సిటీల విద్యా ప్రమాణాల నాణ్యతపై మరింత రాజీకి దారితీస్తుంది. వివిధ యూనివర్సిటీలలో అధ్యాపక సిబ్బంది కూడా ఇప్పటికే ఈ నిబంధనలపై వ్యతిరేకత ప్రకటించారు. ఎందుకంటే వాటి వల్ల నియామకాల్లో నాణ్యత దెబ్బతినిపోతుంది. విద్యా సంబంధమైన ప్రమాణాలు సడలిపోవడం, యూనివర్సిటీల విద్యాప్రమాణాల నాణ్యత దెబ్బ తినడమేగాక పనిభారం పెంపు, తాత్కాలిక నియామకాల ప్రభావం పట్ల కూడా వారు విమర్శ చేశారు. ప్రజల సూచనల కోసం యూజీసీ విడుదల చేసిన ఈ నిబంధనల ముసాయిదా 30 రోజులు అందుబాటులో వుంటుంది. మన విద్యా వ్యవస్థ, దేశ భవిష్యత్తుపై ఆసక్తిగల వారందరూ ఈ నిబంధనలకు తమ వ్యతిరేకతను నమోదు చేయాలి. ఈ నిబంధనల ఉపసంహరణ కోసం విద్యార్థులు, అధ్యాపక వర్గాలు అన్ని ప్రజాస్వామిక శక్తులతో కలసి సమైక్యంగా పనిచేయాలి.

అఖిలభారత విద్యార్థి సమాఖ్య
శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ కార్యదర్శి

తెలుగు రాష్ట్రాలలో కుర్చీలాట



సురవరం సుధాకరరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్టీల కూటమిలో ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడుతున్నట్లు కనపడుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో బయటకు కనపడని అసంతృప్తి ముఖ్యంగా టీడీపీలో ఒక అంతర్లీన భయం కనపడుతోంది. అసాధారణమైన మెజారిటీ సంపాదించిన కూటమిలో ఇంత త్వరగా ఈ సమస్యలు రావటం విచిత్రంగా ఉంది. జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్, బీజేపీ దత్త కుమారుడిగా చెలామణీ ఔతున్నాడు. పత్రికా ప్రకటనలు, ఉపన్యాసాలు 'సనాతన ధర్మం' తరఫున ఘాటైన దాడులు, ఉప ముఖ్యమంత్రిగా ప్రచార ఆర్భాటంతో కూడిన విధాన ప్రకటనలు, పార్టీ బలోపేతం చేసుకునేందుకు రిక్రూట్‌మెంటు కార్యక్రమాలు, టీడీపీ శాసనసభ్యులకు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. టీడీపీలో స్థానం దక్కని వారు జనసేన వైపు చూస్తున్నారు. బీజేపీ తన పార్టీని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. తమతో జతగట్టిన ప్రాంతీయ పార్టీలను మింగెయ్యటం బీజేపీ వారికి అలవాటే. పంజాబ్‌లో అకాలీదళ్, హర్యానాలో దేవీలాల్ కుటుంబ పార్టీలు, తమిళనాడులో ఆల్ ఇండియా అన్నాడిఎంకె అలా విధ్వంసం అవుతున్న ప్రాంతీయ పార్టీలే. మహారాష్ట్రలో శివసేనను, నేషనలిస్ట్ కాంగ్రెసులను చీల్చి, చీలిన శివసేనకు తాత్కాలికంగా ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, ఇప్పుడు మళ్లీ తామే అధికారంలోకి వచ్చారు. పుదుచ్చేరిలో రంగసామి కాంగ్రెసును నామమాత్రం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబును దాదాపు రెండు నెలలు జైల్లో పెట్టి, టీడీపీ నాయకులను ఇబ్బందులు పెట్టడంతో, చంద్రబాబు దిక్కుతోచక పవన్‌కల్యాణ్ ఒత్తిడి మీద బీజేపీ నాయకత్వాన ఉన్న ఎన్.డి.ఎలో చేరాడు. చంద్రబాబు, నితీశ్‌కుమార్‌లాగ రాజకీయ అవకాశవాది. కాని ఆయన బీజేపీని నమ్మడు. బీజేపీ ఆయనను నమ్మదు. బీజేపీలో చేరడం అంటే కొండ చిలువ నోట్లో తలపెట్టడమేనని ఆయనకు తెలుసు.

బూర్జువా రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవని సామెత వుంది. జగన్ స్వయంకృతాపరాధంతోనే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏర్పడి అధికారాన్ని కైవసం చేసుకుంది. నలభై శాతం ఓట్లు వచ్చిన పదకొండు సీట్లే గెలిచినందున ప్రస్తుతం ప్రకటనలకే పరిమితం. ఈ నేపథ్యంలో 'లోకేశ్'ను ఉప ముఖ్యమంత్రిగా చేయాలని టీడీపీ మంత్రులు, ఎంఎల్ఎల ప్రకటనతో జనసేన-టీడీపీ రాజకీయ చదరంగం ప్రారంభమైంది. పవన్‌కల్యాణ్ తదుపరి ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తు న్నాడన్న భయంతోనే టీడీపీ నాయకులు లోకేశ్‌ను ఉపముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్‌కు సమ ఉజ్జీగా నిలపెడదామని వారి ప్రయత్నం. ఇది జనసేనకు ఆగ్రహం కలిగిస్తున్నది. పవన్‌కల్యాణ్‌కు ఇంకా రాజకీయ పరిపక్వత వచ్చినట్లు లేదు. ఆయన సినిమా గ్లామర్ నిదానంగా తగ్గుతుంది. వీరాభిమానులు మిగులుతారు. కుల సమీకరణ ఆయనకు ప్రమాదకరం. ఇతర కులాల వ్యతిరేకత ముంచుతుంది. సందట్లో సడేమియాగా బీజేపీ జనసేనను కలిపేసుకొని, చంద్రబాబుకు చెక్ పెట్టవచ్చు. ఈలోగా వామపక్షాలు పెరిగిన విద్యుత్‌చార్జీల మీద పోరాటం ప్రారంభించడం మంచి పరిణామం. శాసనసభలో సీట్లు లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటాలు వామపక్షాల విశ్వసనీయతను నిలబెడుతాయి.

తెలంగాణ: తెలంగాణలో మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య యుద్ధం జరుగుతున్నది. కాంగ్రెస్, బీజేపీ , బీఆర్ఎస్ రెండు పార్టీలు రాజకీయ పోరాటం చేస్తున్నా బీఆర్ఎస్ నుంచి మరికొన్ని ఫిరాయింపుల మీద ప్రధాన కేంద్రీకరణ పెట్టింది. ఫిరాయించిన పదిమంది శాసనసభ్యులకు చట్టబద్ధత కల్పించాలంటే మరికొన్ని ఫిరాయింపులు అవసరం. బీజేపీ బీఆర్ఎస్‌ను రాష్ట్రంలో బలహీనపరిస్తే, తాము ప్రధాన ప్రతిపక్షంగా, తర్వాత అధికారపార్టీగా మారవచ్చని ఆ పార్టీపైనే విమర్శలు, దాడులు ఎక్కుపెడుతోంది. బీఆర్ఎస్ రెండు పార్టీల దాడిని తట్టుకుంటూ ఆత్మరక్షణలో పడింది. అడపా దడపా బీజేపీ మీద విమర్శలు పెడుతున్నా కాంగ్రెస్ మీదే ప్రధాన పోరాటం చేస్తున్నది. పార్లమెంటు ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయి ఒక్క సీటు పొందలేకపోయినా కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు నిలబెట్టుకోలేదని ఎదురుదాడి చేస్తోంది. రైతు భరోసా రెండు లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శలే కాక రైతుల ధర్నాలు, ఆందోళనలు సాగిస్తున్నది.కె.సి.ఆర్ ఇప్పటికీ నిశ్శబ్దాన్ని పాటిస్తూ కె.టి.ఆర్., హరీశ్‌రావులను రంగంలోకి వదిలిపెట్టాడు. కె.సి.ఆర్ నిశ్శబ్దత దిక్కుతోచక ఉన్నాడా, లేక వ్యూహాత్మక నిశ్శబ్దం పాటిస్తున్నాడా అర్థంకాక బీఆర్ఎస్ శ్రేణులు గందర గోళంలో ఉన్నా, ఇద్దరు రెండవ స్థాయి నాయకులు, కెటిఆర్, హరీశ్‌రావు ఎదురుదాడితో తమ శాసనసభ్యులను, క్యాడర్‌ను నిలబెట్టు కుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు తప్పుడు డిజైన్‌లపైన, రేసింగ్ కార్ల విషయంలో జరిగిన అవినీతి సమస్యలపైన విచారణలు, కేసులు పెట్టడం ద్వారా బీఆర్ఎస్‌ను భయభ్రాంతులకు లోను చేయడానికి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. కేటీఆర్ అరెస్టయితే బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. కాళేశ్వరం కేసు హరీశ్‌రావు మెడకు చుట్టుకోవచ్చు. కెటిఆర్ విమర్శలు ఉక్రోషంతో చేస్తున్నట్లు కనపడితే, హరీశ్ విమర్శలు కొంత మేరకు రాజకీయంగా వుంటున్నట్లు కనపడు తోంది.

తమతో జతగట్టిన ప్రాంతీయ పార్టీలను మింగెయ్యటం బీజేపీ వారికి అలవాటే. పంజాబ్‌లో అకాలీదళ్, హర్యానాలో దేవీలాల్ కుటుంబ పార్టీలు, తమిళనాడులో ఆల్ ఇండియా అన్నాడిఎంకె అలా విధ్వంసం అవుతున్న ప్రాంతీయ పార్టీలే. మహారాష్ట్రలో శివసేనను, నేషనలిస్ట్ కాంగ్రెసులను చీల్చి, చీలిన శివసేనకు తాత్కాలికంగా ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, ఇప్పుడు మళ్లీ తామే అధికారంలోకి వచ్చారు.

శాసనసభ్యుల్లో కౌశిక్‌రెడ్డి దూకుడుగా వున్నాడు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వినోద్‌కుమార్ తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ఎంఎల్ఏలు మరికొంతమంది ఫిరాయింపు లకు సిద్ధంగా వున్నా, స్థానికంగా వారి చేతిలో ఓడిపోయిన కాంగ్రెసు నేతలు, కార్యకర్తలు అభ్యంతరం పెడుతున్నారు. మరిన్ని ఫిరాయింపులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బలం చేకూరుస్తుంది. కాంగ్రెసులో ఇప్పటికే చేరిన దానం నాగేందర్, మహిపాల్‌రెడ్డి రెండు గుఱ్ఱాల మీద స్వారీ చేస్తున్నట్లు కనపడుతోంది. మహిపాల్‌రెడ్డి కార్యాలయం మీద ఒరిజినల్ కాంగ్రెసు వారు దాడి చేయడంతో కొత్తగా చేరేవారు ఆందోళనతో వుంటారు.

విదేశీ పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రుల వేట

స్విట్జర్లాండులోని దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పెట్టుబడుల కోసం, యావచ్ఛక్తితో ప్రయత్నం చేశారు. తెలంగాణకు లక్షా డబ్బయి ఎనిమిదివేల కోట్ల పెట్టుబడి వస్తే, ఏపీకి ఏమీ రాలేదంటున్నారు. అమెరికా, యూరోప్‌లో పారిశ్రామిక కార్మికులు, నిపుణత్వం ఉన్న కార్మికుల వేతనాలు ఎక్కువ. ట్రక్కు డ్రైవర్ల వేతనాలు డాక్టర్ల వేతనాల కంటే ఎక్కువ. మన దేశంలో వేతనాలు చాలా చవుక. ఉచితంగా వందల కోట్ల విలువైన భూములిచ్చి, విద్యుత్ సప్లయి చేసి, రోడ్లు వేసి, నీరిచ్చి, చవక లేబర్ ఇస్తే వారు పెట్టుబడులు పెట్టి, పదింతలు లాభం సంపాదించుకొని, కేంద్రం కక్ష వైఖరి వల్ల రాష్ట్రాలకు పెట్టుబడిలేక విదేశీ పెట్టుబడులకు వెళ్తామంటున్నారు. హైదరాబాదులో ఉన్న కార్పొరేట్ హాస్పటల్స్ మెజారిటీ విదేశీయుల చేతుల్లో ఉన్నాయి. ఆక్స్‌ఫామ్ అంచనా ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి గంటకు 3 కోట్ల డాలర్లు విదేశాలకు పోతున్నాయి. ఈ అంశం పునరాలోచించాలి.

సాయుధ పోరాట సేనానులు-1

ఆర్వీ రామారావ్

స్వాతంత్ర్యానంతరం 1951-52లో జరిగిన మొట్టమొదటి సార్వజనిక ఎన్నికల తరవాత 1952 ఏప్రిల్ 17న లోక్‌సభ మొట్టమొదటి సమావేశం జరిగింది. అప్పుడు పార్లమెంటు భవనంలోకి తొలి అడుగు పెట్టింది అప్పటి ప్రధానమంత్రి పండిత్ నెహ్రూ కాదు... సర్దార్ పటేలూ కాదు. ఆ ఎన్నికలలో అందరికన్నా ఎక్కువ ఓట్లు సంపాదించిన రావి నారాయణ రెడ్డి పార్లమెంటు భవనంలోకి అందరికన్నా ముందు అడుగు పెట్టారు. ఆయనకు నెహ్రూ కన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఇంకా ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు నెహ్రూకు దేశంలో అందరికన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయని ప్రకటించేశారు కూడా. కానీ అప్పటికి ఇంకా రావి నారాయణ రెడ్డి పోటీ చేసిన నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు పూర్తి కాలేదు. తీరా లెక్కింపు పూర్తి అయ్యే సరికి రావి నారాయణ రెడ్డికి అందరికన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయి. అందువల్ల ఆయనకు పార్లమెంటులో మొట్ట మొదట అడుగుపెట్టే అవకాశం వచ్చింది.

బడా భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రావి నారాయణ రెడ్డి తన కుటుంబ అవసరాలకోసం కొద్ది పాటి భూమి ఉంచుకుని వందలాది ఎకరాలు పేదలకు పంచిపెట్టారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఆయనే సేనాని అని చెప్పవలసిన అవసరం లేదు. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ తెలంగాణా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. ఆయన తెలంగాణ ప్రజలను జాగృతం చేసి సాయుధ పోరాటానికి ఎలా సమాయత్తం చేశారనేదే ఈ తరంవారు, భావి తరాలవారు గ్రహించవలసిన ప్రధానాంశం. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడినప్పటి నుంచి ఆయనకు దానితో సంబంధం ఉంది. 1931లో దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు తన సహచరులైన కొంత మంది యువకులను తీసుకుని 90

కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి వెళ్లిన సాహసి.

ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిరంకుశ పాలనలో తెలుగు ప్రజల భాషా, సంస్కృతులను అణగదొక్కారు. తెలుగుకు అస్తిత్వమే లేకుండా పోతున్న దశలో మొదట ఆంధ్ర జనసంఘం ఏర్పడింది. అదే ఆంధ్రమహాసభగా పరిణామం చెందింది. ఆంధ్రమహాసభ సమావేశాలను నిర్వహించుకోవడానికి నిజాం ప్రభుత్వం అనుమతి తీసుకోవలసిన రోజులవి. ఆ అనుమతి దొరకడమే దుర్లభంగా ఉండేది. ఆంధ్రమహాసభ సమావేశాల్లో సాంఘిక అంశాలు తప్ప రాజకీయాలు చర్చించకూడదన్న ఆంక్ష ఉండేది. కానీ రావి నారాయణ రెడ్డి, ఆయన సహచరులు 1934 నుంచి ఆంధ్రమహాసభ స్వరూపాన్నే క్రమంగా మార్చేశారు. ఆంధ్ర మహాసభ చర్చల్లో రావి నారాయణ రెడ్డి చాలా క్రియాశీలంగా ఉండేవారు. ఆ సమయంలో కన్నడ, మరాఠీ మాట్లాడే వారు కూడా హైదరాబాద్ సంస్థానంలో ఉండేవారు. తెలుగు మాతృ భాషగా ఉన్నవారు కూడా చదువుకున్నది ఉర్దూ మీడియంలోనే కనక సభలు, సమావేశాల్లో ఉర్దూనే మాట్లాడే వారు. ఆంధ్రమహాసభల సమావేశాల్లో తెలుగులోనే మాట్లాడాలని కొందరు వాదించారు. ఈ భాషా దురభిమానాన్ని నారాయణ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. రావి నారాయణ రెడ్డి వారి చొరవ వల్లే 1937లో నిజామాబాద్ లో జరిగిన మహాసభలో హైదరాబాద్ సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాడాలన్న తీర్మానం ఆమోదించగలిగారు. పైకి బాధ్యతాయుత ప్రభుత్వం అన్నప్పటికి దాని ఉద్దేశం నిజాం నిరంకుశత్వాన్ని అంతమొందించాలని కోరడమే.



రావి నారాయణ రెడ్డి

దీనితో ఆంధ్రమహాసభ రాజకీయ చర్చలకు వేదికైంది. ఈ సమావేశాల్లో రావి నారాయణ రెడ్డి ఎప్పుడు మాట్లాడినా జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితి గురించి మాట్లాడేవారు. రావి నారాయణ రెడ్డి రాజకీయ పరిణామంలో క్రమోన్మీలనం విశిష్టమైంది. సాంస్కృతికో ద్యమం లక్ష్యంగా ప్రారంభమైన ఆంధ్రమహాసభను సాయుధ పోరాటంగా పరివర్తింప చేసిన వారు ఆయనే. 1946-48 మధ్య హైదరాబాద్ సంస్థానంలో రజాకార్ల ఆగడాలను అరికట్టడానికి అజ్ఞాత దళాలను ఏర్పాటు చేసిందీ ఆయనే. అయితే అందులో ముస్లిం వ్యతిరేకత ఏ కోశానా లేదు. 1941, 1944, 1945లో రావి నారాయణ రెడ్డి ఆంధ్రమహాసభ అధ్యక్షులుగా ఉన్నారు. ఆయన రెండేళ్లు జైలులోనూ, అయిదేళ్లు అజ్ఞాతంలోనూ ఉన్నారు. 1952లో లోక్‌సభ సభ్యుడైన తరవాత 1957లో భువనగిరి నుంచి శాసనసభ్యుడయ్యారు. 1962లో రెండో సారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అరవై ఏళ్లు రాగానే ప్రజా జీవితంలోని అన్ని బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారు కూడా స్వాతంత్ర్య సమరయోధులేనని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో ఆయనదే కీలక బాధ్యత. సాయుధ పోరాట యోధులకు పింఛన్లు రావడానికి ఇది దోహదం చేసింది. 1929లో గాంధీ హైదరాబాద్ సందర్శించినప్పుడు ఆయన భార్య సీతా దేవి 50 తులాల బంగారం హరిజనోద్యమానికి విరాళంగా ఇచ్చారు. హరిజనోద్యమంలో రావి నారాయణ రెడ్డి కీలక పాత్ర పోషించారు. హరిజన సేవా సంఘ్ కార్యదర్శిగా ఉండేవారు. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడే నాటికి ఆయన ఇంటర్మీడియట్ విద్యార్థిగా ఉన్నారు. చదువు మానేసి జాతీయోద్యమంలోకి దూకారు. శాసనోల్లంఘనోద్యమంలో, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. 1934 మార్చి 9న మహాత్మా గాంధీ హరిజన సేవా సంఘ్ నడుపుతున్న పాఠశాల సందర్శించారు. కానీ ఆ పాఠశాలలో అందరూ హరిజనులే ఉండడం గాంధీజీకి నచ్చలేదు. అంటరానితనాన్ని రూపుమాపాలంటే ఆ వసతి గృహాల్లో అగ్ర కులాలు వారు కూడా ఉండాలని సూచించారు. రావి నారాయణ రెడ్డికి క్రీడల్లో ఆసక్తి ఉండేది. స్కౌట్‌గా ఉండేవారు. నటనలోనూ ఆసక్తి ఉండేది. ఆయన మంచి ఫుట్ బాల్ క్రీడాకారుడు. ఫుట్ బాల్ ఆడుతున్నప్పుడు ఆయన వెన్నుపూసకు తగిలిన గాయం ఆయనను జీవితాంతం పీడించింది. వితంతు పునర్వివాహాలు, మహిళల అక్షరాస్యత కోసం రావినారాయణ రెడ్డి విశేషంగా కృషి చేశారు.

సవాళ్లు అధిగమిస్తూ ప్రగతి పథంలో ముందుకు

చైనా పురోగతి అభినందనీయం: జిన్‌పింగ్

బీజింగ్: ఎన్ని సవాళ్లు ఎదురైనాగానీ వాటిని అధిగమిస్తూ ప్రగతి పథంలో ముందుకు వెళుతున్నామని, చైనా సాధిస్తున్న పురోగతి అభినందనీయమని ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్స్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో జిన్‌పింగ్ మాట్లాడారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రెండు వేల మంది హాజరయ్యారు. చైనా ప్రజలతో పాటు హాంగ్‌కాంగ్ ప్రత్యేక పరిపాలన ప్రాంతం, మకావ్ ప్రత్యేక పరిపాలన ప్రాంతం, తైవాన్, విదేశాల్లోని చైనా పౌరులు అందరికీ స్ప్రింగ్ పండుగ శుభాకాంక్షలను జిన్‌పింగ్ ఈ సందర్భంగా తెలిపారు. గత ఏడాది కాలంలో విధానాలను సమర్థంగా అమలు చేయడం, ప్రోత్సాహక విధానాల ప్యాకేజీలను తీసుకు రావడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పుంజుకోగలిగిందని చెప్పారు. సాంకేతికపరమైన పురోగతి, పారిశ్రామిక విప్లవం చెప్పుకోదగ్గ పరిణామాలన్నారు. చైనాలో ఉద్యోగాల కల్పన, వినిమయ ధరలు స్థిరంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలోనూ చైనా గణనీయమైన పాత్ర పోషించిందని జిన్‌పింగ్ చెప్పారు. ప్రకృతి విపత్తులను చైనా సమర్థంగా ఎదుర్కోగలిగిందని, పారిస్ ఒలింపిక్స్‌లో రాణించిందని, ప్రపంచ శాంతి, సుస్థిరత పరిరక్షణ, మానవాభివృద్ధి, పురోగతిని ప్రోత్సహించడం కోసం సానుకూలతను చైనా తీసుకు రాగలిగిందని వెల్లడించారు. గత 12 నెలల్లో తమ ప్రయాణం అసాధరణంగా, ప్రోత్సాహకర విజయాలతో సాగిందని చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా చైనా ప్రజలను ఆపలేవని మరోమారు నిరూపించామన్నారు. సంస్కరణలు, అభివృద్ధిలో కొత్త విజయాలు సాధించగలమని నొక్కిచెప్పారు. 15వ పంచవర్ష ప్రణాళిక (2026-2030) రూపొందిస్తామని, గొప్ప లక్ష్యాల సాధన దిశగా ముందుకెళతామని జిన్‌పింగ్ తెలిపారు.

ట్రంప్ కక్షసాధింపు

- న్యాయ శాఖ ప్రక్షాళన 12 మందిపై వేటు
- తనపై విచారణ జరిపించిన అధికారులే లక్ష్యం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ కక్షసాధింపుకు దిగారు. తనపై విచారణ జరిపించి, తనను న్యాయ ఉచ్చులోకి నెట్టిన అధికారులపై చర్యలకు ఉపకరించారు. న్యాయ శాఖ ప్రక్షాళనకు ఆదేశాలిచ్చారు. ఇదే క్రమంలో 12 మంది న్యాయ శాఖ అధికారులపై వేటు విధించారు. ఈ మేరకు అటార్నీ జనరల్ జేమ్స్ మెక్ హెన్రీకు ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయ శాఖ తెలిపింది. 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత తనపై దర్యాప్తు అధికారులను ట్రంప్ తొలగించారు. అధ్యక్షుడి అజెండాను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఈ అధికారులను విశ్వసించలేమని, అందుకోసమే ఆపద్ధర్మ అటార్నీ జనరల్ జేమ్స్ మెక్ హెన్రీ ఈ నిర్ణయం తీసుకున్నారని న్యాయశాఖ అధికారి ఒకరు తెలిపారు. ఎంత మందిపై వేటు పడింది మాత్రం చెప్పలేదు. అయితే కనీసం 12 మందిని తొలగించారని అమెరికా మీడియా చెబుతోంది. అయితే మాజీ ప్రత్యేక న్యాయవాది జాక్ స్మిత్ ఈనెలారంభంలో రాజీనామా చేశారు. ఈయన ట్రంప్‌పై రెండు ఫెడరల్ కేసులు పెట్టారు. మాజీ అధ్యక్షుడిపై నేరారోపణలు చేశారు. 2020 ఎన్నికల ఫలితాలను ట్రంప్ ఉద్దేశపూర్వకంగా మార్చేందుకు యత్నించారన్నది ఆయన చేసిన ప్రధాన ఆరోపణ. రహస్యపత్రాలను తనతోపాటు తీసుకెళ్లారన్న మరో కేసు కూడా ట్రంప్‌పై ఉంది. ఈ కేసుల్లో దర్యాప్తులను ట్రంప్ వ్యతిరేకించారు. రెండింటిలో ఏ కేసు కూడా కోర్టులో విచారణకు రాలేదు. అయితే నవంబరులో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ గెలుపొందిన తర్వాత తన కేసులను స్మిత్ ఉపసంహరించుకున్నారు. ఎన్నికలకు ముందు స్మిత్‌పై ఏదో ఒక రోజు వేటు పడుతుందని ట్రంప్ చెప్పడం తెలిసిందే.

సైనిక దళాల్లో కీలక మార్పులు

అమెరికా సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించాలని ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీంతోపాటు ట్రాన్స్‌జెండర్లు అమెరికా సాయుధ దళాల్లో పని చేయకుండా నిషేధం విధించారు.

కోవిడ్ వాక్సిన్లు తీసుకోవడానికి నిరాకరించి చర్యలకు గురైన వారిని మళ్లీ దళాల్లోకి తీసుకొంటున్నట్లు ప్రకటించారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు వస్తున్న సమయంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలోనే ఈ ఆదేశాలపై ట్రంప్ సంతకం చేసినట్లు శ్వేతసౌధం పేర్కొంది. 2017లో కూడా ట్రంప్ ట్రాన్స్‌జెండర్లను సైనిక దళాల్లో చేరకుండా నిషేధం విధించారు. 2021లో జో బైడెన్ ఆ ఆదేశాలను నిలిపివేశారు.

31 నుంచి పార్లమెంటు

(మూడోపేజీ తరువాయి)

విడుదలైన పార్లమెంటరీ బులిటెన్ ప్రకారం.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడతారు. అంతకుముందు రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి. పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు ప్రతిపక్ష నాయకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ఠ దెబ్బతిందని.. ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సారి బడ్జెట్ బాగుటుందని అందరూ ఆశిస్తున్నారని తెలిపారు.

అమెరికన్లకు ఆదాయపు పన్ను రద్దు!

ఐటీ స్థానంలో దిగుమతి సుంకాల వాడకానికి ట్రంప్ ప్రతిపాదనలు

వాషింగ్టన్: అమెరికన్లకు ఆదాయపు పన్ను రద్దు చేసే యోచనలో అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఆర్థిక వ్యవస్థలో నిధుల ప్రవాహాన్ని పెంచే విధంగా ప్రజల్లో ఖర్చు సామార్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఆదాయపు పన్ను రద్దు చేసి దానిని దిగుమతి సుంకాలతో భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. 'అమెరికన్లను ధనవంతులు, మరింత శక్తిమంతులుగా చేసే వ్యవస్థలోకి మనం వెళుతున్నాం. ఇతర దేశాలను సుసంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు వేయడానికి బదులుగా విదేశాలపై పన్నులు విధించి అమెరికన్లను సంపన్నులు చేయాలి. ఇందుకోసం 'ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసు'ను ప్రారంభించాను' అని రిపబ్లికన్ సభ్యుల సమావేశంలో ట్రంప్ అన్నారు. 1870 నుంచి 1913 వరకు ప్రజలు అత్యధిక సంపదతో తులతూగారని ట్రంప్ పేర్కొన్నారు. నాడు సుంకాల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేదని చెప్పారు. అప్పట్లో దిగుమతి సుంకాల నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభించేదన్నారు.

అమెరికా తక్షణమే తన వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు. అమెరికా ఉద్యోగులు, కుటుంబాలను రక్షించేలా చర్యలు తీసుకోవాలని ట్రంప్ సూచించారు.

చైనా, భారత్, బ్రెజిల్‌పై పన్నులు విధిస్తాం

భారత్, చైనా, బ్రెజిల్ దేశాలపై పన్నులు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. చైనా భారీగా పన్నులు వసూలు చేస్తుందని, భారత్, బ్రెజిల్ సహా ఇతర దేశాలు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నాయని, అమెరికా కూడా ఇదే పద్ధతిని పాటించాలని, అమెరికా ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ట్రంప్ అన్నారు. ఇదిలావుంటే బ్రిక్స్ దేశాలు ప్రత్యేక కరెన్సీ తెస్తే 100శాతం సుంకం విధిస్తామని ఆయన గతంలోనే హెచ్చరించారు. డాలర్ వినియోగం నిలిపేస్తే తీవ్ర పరిణామాలు తప్పబోవంటూ హెచ్చరికలు చేశారు.

ఢిల్లీ సీఎం ఆతిశీకి ఊరట

(మూడోపేజీ తరువాయి)

కొందరు విమర్శలు గుప్పించారు. ఇది గతేడాది ఏప్రిల్‌లో జరిగింది. ఈ పరిణామం క్రమంలో బీజేపీ నేత ప్రవీణ్ శంకర్ కపూర్ కోర్టుకు వెళ్లారు. ఆతిశీపై పరువు నష్టం దావా వేశారు. ఆప్ నాయకులు బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు నెల రోజుల ముందు జరిగిన ఈ వ్యవహారాన్ని రౌస్ అవెన్యూ కోర్టు మంగళవారం విచారించింది. ఆతిశీపై కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీకి ఉపశమనం లభించింది. కాగా, కాల్కాజీ స్థానం నుంచి ఆతిశీ ఈసారీ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

యూసీసీపై కోర్టుకెళతాం

ఉత్తరాఖండ్ ముస్లిం సంఘాల ప్రకటన

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమలుతో ఆ రాష్ట్ర ముస్లింలలో అలజడి మొదలయ్యింది. తమ వర్గమే లక్ష్యంగా తీసుకొచ్చిన కొత్త శాసనంపై కోర్టుకెళతామని ముస్లిం సంఘాలు తెలిపాయి. కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రజలను మతం పేరుతో విభజించేందుకు సంఘ్ పరివార్ ఇలంటి చర్యలకు పూనుకుంటున్నట్లు విమర్శలు గుప్పుమన్నాయి. యూసీసీపై ముస్లిం సంఘాలు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాయి. ముస్లిం పర్సనల్ చట్టాల్లో బీజేపీ ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యాన్ని ఆక్షేపించాయి. ముస్లింలు, ఇతర మైనారిటీలే లక్ష్యంగా హిందూత్వ అజెండా ఉందన్నాయి. యూసీసీ చట్టబద్ధతను కోర్టులో సవాల్ చేసేందుకు జామాతే ఉలేమా ఏ హింద్, ముస్లిం సేవా సంఘటన్, ముస్లిం పర్సనల్ లా బోర్డ్ నిర్ణయించాయి. ముస్లిం సేవా సంఘటన్ అధ్వర్యంలో రాజధాని డెహ్రాడూన్‌లో షెహర్ ఖాజీ మౌలానా అహ్మద్ ఖాస్మీ నేతృత్వంలో జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట ధర్నా పెద్దఎత్తున జరిగింది. అనంతరం గవర్నర్‌నుద్దేశిస్తూ వినతి పత్రాన్ని ప్రతినిధులు అందజేశారు. రాజ్యాంగం హామీనిచ్చిన పర్సనల్ చట్టాల్లో, ముస్లింల మత విశ్వాసాల్లో బీజేపీ ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. ఈ చట్టం సారూప్యతకు హామీ ఇవ్వడంలేదు. సామాజిక ఐక్యతకు విఘాతం కలిగిస్తుందని మౌలానా అహ్మద్ ఖాస్మీ అన్నారు. ప్రజాస్వామిక పద్ధతిలో కొత్త శాసనంపై పోరాటం చేస్తామన్నారు. అవసరమైన న్యాయస్థానాలన్నింటిని ఆశ్రయిస్తామని ముస్లిం సేవా సంఘటన్ అధ్యక్షుడు నయీం ఖురేషీ తెలిపారు. ఉత్తరాఖండ్ బార్ కౌన్సిల్ మాజీ చైర్‌పర్సన్ రజియా బేగ్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని హైకోర్టులో సవాల్ చేస్తామన్నారు. ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా యూసీసీ అమలును ఖండించారు. అన్ని వర్గాలకు 'హిందూ కోడ్' అమలు చేశారని విమర్శించారు. కాగా, కొత్త కోడ్‌పై న్యాయ పోరాటానికి ముస్లిం పర్సనల్ లా బోర్డు కూడా నడుం బిగించినట్లు సమాచారం.

మన్యంలో 'మద్యం' దోపిడీ

(మూడోపేజీ తరువాయి)

తొక్కి... నష్టాల నుంచి గట్టెక్కేందుకు సదరు వ్యాపారులు కొత్త పుంతలు తొక్కేలా చేసింది. సర్కార్ కొత్త విధానం తెస్తూనే రాజకీయ నాయకుల ప్రమేయం, సంబంధిత శాఖల అధికారుల జోక్యం లేకుండా చేస్తూ తొలుత సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరికలు చేసిన విషయం విదితమే. ప్రభుత్వం ప్రకటించిన మద్యం ధరలకు నయా పైసా అదనం కాకుండా, ప్రభుత్వానికి మచ్చ రాకుండా, ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా మద్యం విధానం ఉంటుందంటూ చంద్రబాబు ప్రకటించారు. అయితే అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో మద్యం సిండికేట్లు నష్టాలను చవిచూస్తున్నారు. దీంతో దానిని సరిచేసుకోవటానికి కొత్త పుంతలు తొక్కేలా చేసింది ప్రభుత్వం. రాష్ట్రంలో మూడు నెలల క్రితం మద్యం షాపుల నిర్వహణకు లాటరీ విధానంలో షాపుల కేటాయింపు జరిగింది. మద్యం అమ్మకాల్లో ఒక్కో రకంపై 9.35 శాతం లాభాలు దుకాణదారులకు ఇస్తుండగా, గణనీయమైన నష్టాలను వ్యాపారులు చవిచూస్తున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లగా... లాభాలను ప్రభుత్వం 9.35 నుంచి 13 శాతానికి పెంచింది. అయినా మన్యంలో నష్టాలను చవి చూస్తున్న సదరు మద్యం దుకాణదారులు ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ మన్యంలో రాజకీయ, పోలీసు, ప్రొహిబిషన్ అధికారులతో జరిపిన మంతనాలు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. దీని ద్వారా ప్రతి క్వార్టర్‌పై దుకాణదారు రూ.10 అదనంగా వసూలు చేస్తుండగా, ఇక బెల్టు షాపు నిర్వాహకులు మరో రూ.10 వసూలుకు తెగించేశారు. బెల్టు షాపులకు అనుమతులు ఇచ్చే సంబంధిత అధికారులకు అధిక మొత్తంలో నెల వారీ మామూళ్లు ఇచ్చేందుకు ఒక ఒప్పందానికి వచ్చినట్టు సమాచారం. దీనిద్వారా ప్రతి క్వార్టర్ కొనుగోలుపై సామాన్యులకు రూ.30 నుంచి రూ.50 అదనపు భారం పడుతుంది. ఈ తాజా ఒప్పందంతో మద్యం సామాన్యులకు మరింత ప్రియంగా మారింది. మన్యంలోని రంపచోడవరం డివిజన్ కేంద్రంలో జరిగే ఆదివారం సంతకు అసంఖ్యాకంగా జనం తరలి వస్తారు. మద్యం షాపుతో పాటు పాన్ షాపుల్లో కూడా మద్యం అమ్మకాలు యదేచ్ఛగా జరుగుతుండటం విశేషం.

నేడు నింగిలోకి జీఎస్ఎల్వీ ఎఫ్15

(మూడోపేజీ తరువాయి)

చాటిచెబుతోంది. శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి 3.4 మీటర్ల వెడల్పు కలిగిన లోహ ఫెయిరింగ్‌తో ఈ ప్రయోగం జరుగుతుంది. ఈ మిషన్ ప్రధాన లక్ష్యం ఎన్వీఎస్ 02 ఉపగ్రహాన్ని భూమి సమకాలిన బదిలీ కక్ష్యలో ప్రవేశపెట్టడం. స్వదేశీ నావిగేషన్ నావిక్ భారతదేశ స్వదేశీ ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. ఇది కచ్చితమైన స్థాన, వేగం, సమయం సేవలను అందించడానికి రూపొందించారు. భారతదేశం, దాని పరిసర 1,500 కిలోమీటర్ల పరిధిని ఇది కలిగి ఉంటుంది. రెండు సేవలను అందిస్తుంది. స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ 20 మీటర్లలోపు కచ్చితత్వంలో పని చేస్తుంది. రెస్ట్రిక్టెడ్ సర్వీస్ ప్రత్యేక నావిగేషన్ సామర్థ్యాలను అందిస్తుంది. ఎన్వీఎస్ నావిక్ రెండో తరం ఉపగ్రహం. ఇది ఐ2కె బస్ ప్లాట్‌ఫాంను కలిగి ఉంది. దీని లిఫ్ట్ ఆఫ్ మాసు 2,250 కిలో గ్రాములు. 3 కిలోవాట్ల శక్తి నిర్వహణ సామర్థ్యం, ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో నావిగేషన్ పేలోడ్లు, సీ బ్యాండ్‌లో రేంజింగ్ పేలోడ్లు ఉన్నాయి. కాగా ఇది 111.75 స్థానంలో ఐఆర్ఎన్ఎస్ఎస్1ని భర్తీ చేస్తుంది. ఎన్వీస్ 02 ఉపగ్రహాన్ని బెంగళూరులోని యూఆర్ శాటిలైట్ సెంటర్ (యూఆర్ఎస్సీ) రూపొందించారు. దీని అంతరిక్ష పరిస్థితులలో పనితీరును నిర్ధారించడానికి థర్మోవాక్, డైనమిక్ టెస్టింగ్ సహా కఠినమైన పరీక్షలు నిర్వహించారు. ఈ ఎన్వీఎస్ ఉపగ్రహం స్వదేశీ అణు గడియారాలను కలిగి ఉండటం ద్వారా సమయం కచ్చితత్వాన్ని మెరుగుపరుస్తుంది. దీనిని 2023 మే 29న ప్రయోగించిన ఎన్వీఎస్01 ఉపగ్రహం ఆధారంగా మరింత అభివృద్ధి చేయడం జరిగింది. ఈ జీఎస్ఎల్వీ ఎఫ్15 ప్రయోగం ఇస్రోకు చెందిన 100వ ప్రయోగ విజయాన్ని మాత్రమే కాకుండా స్వదేశీ అంతరిక్ష సాంకేతికతల అభివృద్ధి పట్ల భారత కట్టుబాటును కూడా ప్రతిబింబిస్తోందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ప్రయోగానికి సంబంధించి షార్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

ఎకో టూరిజానికి చర్యలు

(మూడోపేజీ తరువాయి)

ఆలయాలు తెలంగాణలో ఉన్నాయని వివరించారు. నల్లమల అడవులు, మల్లెల తీర్థం వంటి ప్రాంతాలు మన రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో టూరిజం పాలసీని తీసుకురాబోతున్నామని వెల్లడించారు. దీని ద్వారా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయబోతున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇది అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. వికారాబాద్ అటవీ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉందని, అందుకే త్వరలో వికారాబాద్ ప్రాంతాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా రామ్‌దేవ్ ఈ పార్క్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. తమ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకృతి వనంగా మార్చాలని భావిస్తోందని, వనజీవి రామయ్య వంటి వారిని మనం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

గద్దర్‌పై విమర్శలు సిగ్గుచేటు

వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను అవమానించడమంటే తెలంగాణ ఉద్యమాన్ని కించపర్చడమేనని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటనే తన మాటలను వెనక్కి తీసుకోని పక్షంలో పజలే తగిన బుద్ధి చెబుతారని ఖాద్రీ, ధర్మేంద్ర హెచ్చరించారు. ఇద్దరు నాయకులు మంగళవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీపై, బండి సంజయ్‌పై విమర్శలు గుప్పించారు. సాహిత్య కళారూపం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటం సాగించిన గద్దర్‌పై బండి సంజయ్ విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నేతలను హత్య చేయించిన గద్దర్‌కు అవార్డ్ ఇవ్వాలా అంటూ మీడియా సాక్షిగా నిరాధార వ్యాఖ్యలను చేసిన బండి సంజయ్... కేంద్ర మంత్రిగా అనర్హులన్నారు. బీజేపీ చరిత్ర ప్రజలకు తెలుసని... గాంధీని చంపిన గాడ్సే బీజేపీ-ఆర్ఎస్ఎస్ వర్గీయుడు కాదా అని ప్రశ్నించారు. బీజేపీది హత్యా రాజకీయమని, హిందూత్వ పేరుతో అణగారిన వర్గాలను గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఊచకోత సాగించిందని దుయ్యబట్టారు. ఇలాంటి బీజేపీతో దేశానికి ప్రమాదమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోగానీ దేశంలో జరిగిన ఏ పోరాటంలోగానీ బీజేపీకి పాత్రే లేదని అన్నారు. చరిత్రను వక్రీకరించడం బీజేపీ నీచ రాజకీయాలకు నిదర్శనమని ఖాద్రీ, ధర్మేంద్ర దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్, సమితి సభ్యుడు భోనగిరి మహేందర్, కరీంనగర్ జిల్లా కన్వీనర్ లంకా దాసరి కల్యాణ్, నాయకుడు సురేశ్ పాల్గొన్నారు.

రైతుబంధు బంద్‌కు కుట్ర

(మూడోపేజీ తరువాయి)

జిల్లావేదికగా మారాలన్నారు. నీళ్లు లేక తీవ్ర కరువుతో అల్లాడిన ఉమ్మడి డి నల్లగొండ జిల్లాను కాళేశ్వరం ప్రాజెక్టుతో సస్యశ్యామలమైన జిల్లాగా మార్చిన గొప్ప నేత కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో నూటికి నూరుశాతం రైతులకు రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని శాసనసభలో సవాలు విసిరినా... రేవంత్ రెడ్డి తోకముడిచారని పేర్కొన్నారు. ధాన్యం దిగుబడిలో నల్లగొండ జిల్లాను నెంబర్ వన్ స్థానంలో నిలిపింది కేసీఆరేనని తెలిపారు. రాష్ట్రంలో కేవలం 25శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించిదని కేటీఆర్ పేర్కొన్నారు. జిల్లాలో రైతు సమస్యలపై పోరాటం చేస్తున్న కంచర్ల భూపాల్ రెడ్డిని కోమటిరెడ్డి అరెస్టు చేయించడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి కి దమ్ముంటే గడియారం సెంటర్ లో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు చేసిన మేలు ఏంటో ప్రకటించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మహాధర్నాలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు,మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు

రైతుల డిమాండ్లన్నీ పరిష్కరిస్తేనే...

(మూడోపేజీ తరువాయి)

మొదటి వార్షికోత్సవం సందర్భంగా చేపట్టే ఆందోళనను జయప్రదం చేయండి అని రైతాంగానికి పిలుపునిచ్చారు. జనవరి 4న కిసాన్ మహాపంచాయత్ తర్వాత ఆయన సమావేశంలో మాట్లాడటం ఇదే మొదటిసారి. 'ఫిబ్రవరి 12న ఖనౌరీకి తరలి రండి. ఆ రోజున మన ఆందోళనకు ఏడాది పూర్తిఅవుతుంది. అదే సందర్భంగా చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయండి. పెద్ద సంఖ్యలో మీరంతా వస్తే నాకు ధైర్యం, శక్తి లభిస్తాయి. కేంద్రంతో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు బలం వస్తుంది' అని దలేవాల్ అన్నారు. చండీగఢ్ చర్చలకు హాజరయ్యేంత శక్తి తన ఒంట్లో ప్రస్తుతానికి లేదని, ఆరోగ్యం సహకరిస్తే తప్పక చర్చలకు వెళతానన్నారు. భౌతికంగా హాజరు కాలేని పక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటానని దలేవాల్ చెప్పారు. మోర్చా విజయాన్ని కాంక్షిస్తూ రైతు సంఘం అధ్వర్యంలో అఖండ్ పథ్ జరగబోతోందని తెలిపారు. రైతుల డిమాండ్లకు అంగీకరించేలా ప్రభుత్వంలో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. పంజాబ్‌లోని మోగాలో రైతుల మహాపంచాయత్ అనంతరం ఐక్యతా సంకల్పంతో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు ఖనౌరీ వద్దకు వచ్చారని దలేవాల్ అన్నారు. తీర్మానానికి ఆమోదం, ప్రజా అంగీకారం లభించినాగానీ అమలుకు ఆటంకం ఏమిటంటూ ప్రశ్నించారు. విజయానికి దగ్గరల్లో ఉన్నామని చెప్పారు. ఐక్య సంఘటన ఏర్పాటు కోసం ఇంత సమయం ఎందుకు పడుతుందో తెలియడం లేదన్నారు. చర్చోపచర్చలు జరుగుతున్నాయని తెలిపారు. 'ఎస్‌కేఎం నేతలతో చర్చలు సాగుతున్నాయి కానీ ఆ సమావేశాలకు వెళ్లలేదు కాబట్టి అక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియదు' అని దలేవాల్ చెప్పారు. ఇన్ని దఫాలుగా సమావేశాలు నిర్వహించడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజల మనోభావాల దృష్ట్యా ఐక్య పోరు అవశ్యమని దలేవాల్ నొక్కిచెప్పారు. ఇదిలావుంటే... ఎస్‌కేఎం, ఎస్‌కేఎం (నాన్ పొలిటికల్), కేఎంఎం (కిసాన్ మజ్దూర్ యూనియన్) మధ్య జనవరి 13, 18 తేదీల్లో రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. ఆ సమావేశాల్లో రైతు నాయకులు జోగిందర్ సింగ్ ఉగ్రాహన్, బల్బీర్ సింగ్ రాజేవాల్, డాక్టర్ దర్శన్ పాల్, సర్వన్ సింగ్ పంధేర్, మంజిత్ రాయ్, కాకా సింగ్ కోట్రా, అభిమన్యు కోహర్ పాల్గొన్నారు.

నలుగురితో కమిటీ

(మూడోపేజీ తరువాయి)

ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని సీఎం అన్నారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలని సూచించారు. ఆదాయం పెరిగే మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. ఇసుక మాఫియా కట్టడికి చర్యలు చేపట్టాలన్నారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూళ్లు కాకపోవడంపై అధికారులను సీఎం ప్రశ్నించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధ్యయన కమిటీని సీఎం ఆదేశించారు. సమీక్షలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

సంక్షేమమే మా విధానం

(మూడోపేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. క్రికెట్, ఫుట్ బాల్ ఆడేందుకు వీలుగా క్రీడా మైదానాలు ఈ పాఠశాలలో ఉంటాయని భట్టి తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సినిమా ప్రదర్శించేందుకు థియేటర్లు కూడా నిర్మిస్తున్నామన్నారు. ఉత్తమ అధ్యాపకులు, ఉత్తమ భోజనం అందిస్తామని చెప్పారు. బహుళ జాతి కంపెనీలు ఆశిస్తున్న నైపుణ్యత యువతీయువకులకు ఉండేందుకు స్కిల్ యూనివర్సిటీ స్థాపించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను నవీకరిస్తున్నట్లు చెప్పారు. సరైన నైపుణ్యతను నేర్పడానికిగాను వీటిని అధునాతక సాంకేతిక కేంద్రాలుగా మార్చినట్లు తెలిపారు. విద్యారంగానికి ఈ ఆర్థిక సంవత్సరం రూ.21 వేల కోట్లు కేటాయించామని, అవసరమైతే దానిని పెంచుతామని చెప్పారు.

60 యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి రూ.5 వేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క తెలిపారు. హాస్టల్ విద్యార్థుల డైట్ కాస్మోటిక్ చార్జీల పరిస్థితిపై సమీక్షించి 40 శాతం డైట్ చార్జీలు, 25శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు. సీనియర్ అధికారులు, మంత్రులు వసతి గృహాలను సందర్శించేలా ఆదేశాలిచ్చామని చెప్పారు. కొత్తగా డీఎస్సీ నిర్వహించి ఆరు వేల టీచర్లను నియమించామని, 35 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు-బదిలీలు అమలయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. అధికారంలోకి రాగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని గుర్తుచేశారు. యూపీఎస్సీ తరహాలో ఉద్యోగాల భర్తీ చేపడుతున్నాం. ఇప్పటికే 56,000 మందికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై సమగ్ర విచారణకు విద్యా కమిషన్లు ఏర్పాటు చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

(మూడోపేజీ తరువాయి)

ప్రభుత్వం వివక్ష చూపిందని, అవార్డుల ప్రకటనలో సమాఖ్య స్ఫూర్తి లోపించిందని ఆయన విమర్శించారు. పద్మ అవార్డులను వివిధ రంగాలలో విశేష సేవ చేసిన వారికి అందజేస్తారని, వీటి విషయంలో రాజకీయాలు చూడకూడదని హితవు పలికారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బండి సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జానపద కళలు, సాహిత్య రంగంలో చేసిన సేవలకు గుర్తుగా గద్దర్‌కు పద్మ అవార్డు ప్రకటించాల్సి ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజలను ఉర్రూతలూగించాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా పద్మ అవార్డుల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, జక్కు రాజుగౌడ్, నిమ్మల మనోహర్, ఎదునూరి వెంకట్రాజం, మాలోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సీఎంరేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ ఫిర్యాదు

ఫార్ములా ఈ రేసు కేసులో సీఎంను ముందు విచారించాలి : బీఆర్ఎస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫార్ములా ఈ రేసు కేసులో సీఎం.రేవంత్ రెడ్డినే ముందుగా విచారించాలని బీఆరెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే కోట్ల పెట్టుబడులకు ఆటంకం కలిగించిన రేవంత్ రెడ్డిపై, తెలంగాణ బిడ్డగా మంగళవారం నాడు నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు బీఆరెస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీఎం అనాలోచిత విధానాల వల్ల ఫార్ములా ఈ రేస్ ఒప్పందాన్ని రద్దు చేయడం వల్ల వేల కోట్ల పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలి పోతున్నాయనే ఆవేదనతో భారత న్యాయ సంహిత 316, బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ కింద ఫిర్యాదు చేశానని వివరించారు. కేవలం రాజకీయ కక్షలతో ప్రతిపక్ష పార్టీలను విల్లును చూపెట్ట డం కోసం, ఏదో అవినీతి జరిగిందని ప్రజలకు అబద్దాలు చెప్పి, వేలాది మంది నిరుద్యో గుల బతుకుల్లో మన్ను కొట్టిన రేవంత్ రెడ్డి పై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందే అని డిమాండ్ చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో, ఏ నాడు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రులు తీసుకొచ్చిన ప్రజా ప్రయోజన పథకాలను ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. తన మంత్రివర్గ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ కంపెనీతో ఒప్పందాలు చేసుకుంటున్నారని, ఇదంతా రాగద్వేషం, రాజ్యాంగ విరుద్ధం కాదా అని నిలదీశారు. పోలీసులు ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమే అనే నిబంధన మరువకుండ సీఎం పై కేసి నమోదు చేయాలని, మీరు పట్టించుకోకపోతే, న్యాయస్థానం ఉందని మరవకండని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫీడ్ చైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర - అమనగల్లు : తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫీడ్ చైర్మన్ గంగారెడ్డిని కడ్తాల్ మండ లానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా కడ్తాల లో మర్యాద పూర్వకంగా మంగళవారం కలుసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలను ఇబ్బంది కలగకుండా ముందస్తుగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులు మధ్య దళారులను, ఆసాములను రైతులు ఆశ్రయించి మోసపోకుండా కట్టడి చేయాలని కోరినట్లు శ్రీనివాస్ గుప్తా తెలిపారు. బ్లాక్ మార్కెట్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు. ఫర్టిలైజర్ దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విత్తనాలను రైతులకు విక్రయించే విధంగా అధికారులకుఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. గంగారెడ్డిని సన్మానించిన వారిలో మాజీ ఎంపిటిసి రమేష్, బిఆర్ఎస్ నాయకులు రాములు గౌడ్, సాయిలు గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆపద మిత్ర శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

- ఫిబ్రవరి 2లోగా సమర్పించాలి, - జిల్లా అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆపదమిత్ర శిక్షణకు జిల్లాలోని అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అదరపు కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి జి ముకుంద రెడ్డి తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్, ఆపద మిత్ర వారి ఉత్తర్వుల మేరకు తెలంగాణా రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సూచనల మేరకు (ఆపద మిత్రుడు) 'ప్రకృతి వైపరీత్యాలైన లాండ్ స్లైడ్స్, భూకంపాలు, తుఫాన్లు వరదలు మొదలుగున్నవి సంభవించినప్పుడు స్వచ్ఛందంగా సేవ చేయుటకు సన్నద్ధులను చేయుట 3 విడతలు శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించారు. శిక్షణ సమయములో ఉచిత భోజనము, వసతి, శిక్షణ సర్టిఫికెట్ ఇస్తారని అర్హులైన హైదరా బాద్ జిల్లా యువతీ యువకుల నుండి దరఖాస్తులు కోరారు. అభ్యర్థులు 18 సంవత్సరాలు పైబడిన వారు కనీసం 7వ తరగతి ఆపైన విద్య అర్హతలు (కళాశాల / యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు) ఉత్తర్ణులైన సేవాభావం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని అయన తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం, స్నేహ సిల్వర్ జూబిలీ భవనము, 3 ఫ్లోర్ , %దీ%-303, కలెక్టరేట్ కాంప్లెక్స్, లకడీ కాపూల్, హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు ఫారంలను పొంది,పూర్తిచేసిన దరఖాస్తులు పైన తెలిపిన కార్యాలయంలో ఫిబ్రవరి 2-2025 వ తేదిలోపు సమర్పించగలరని నోడల్ అధికారి తెలిపారు.

కేసీఆర్ - కేటీఆర్ వద్ద మార్కుల కోసం ఆరేస్ తపన

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేసీఆర్, కేటీఆర్ దగ్గర మార్కుల కోసం తపన పడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మతి తప్పి మాట్లాడుతున్నాడని ప్రభుత్వ రామ చంద్ర నాయక్ అన్నారు. వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చూపించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్‌పార్టీకి ప్రవీణ్ కుమార్ తాబేదారుగా తయారయ్యాడని విమర్శించారు. మంగళవారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రం 50 యేళ్ల వెనక్కి పోయిందన్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో అవినీతి పైన ప్రాథమిక ఆధారాలున్నాయని ఏసీబీ, ఈడీ తేల్చిందని, ఇపుడు ఫార్ములా ఈ రేస్ లో తెలంగాణ ఆదాయానికి సీఎం రేవంత్ రెడ్డి గండి కొట్టారని పిచ్చి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిచ్చి పిచ్చి గా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. దళిత, గిరిజన ,బహుజన విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన మోసం అంతా ఇంతా కాదని, దళిత, గిరిజన, బహుజనుల హక్కుల కోసం పోరాడుతానని చెప్పి చివరకు ఎంపీ సీటు కోసం బీఆర్ఎస్ చేరాడని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ కంపెనీ లకు పంపించిన డబ్బును తిరిగి పార్టీ ఫండ్‌గా కేటీఆర్ తెచ్చుకున్నాడని ఆరోపించారు. అవినీతి సొమ్ముతో కేటీఆర్ కళ్లు మూసుకుపోయాయన్, ప్రవీణ్‌కుమార్ ఇప్పటికైనా మాటలు కట్టి పెట్టాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులకు బండిసంజయ్ క్షమాపణ చెప్పాలి : మెట్టు సాయికుమార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమకారులను, ప్రజలను అవమానపరిచేలా మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండిసంజయ్ వెంటనే క్షేమపణ చెప్పాలని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండికి తెలంగాణ ఉద్యమకారులు ప్రాణ త్యాగం విలువ తెలియదని మండిపడ్డారు. అసలు పద్మ అవార్డులు ఇచ్చేది ఎవరు కేంద్ర ప్రభుత్వమా? బిజెపి అధ్యక్షుల? మీ అమిత్ షా నా? నడ్డా నా? అంటూ ప్రశ్నించారు. గద్దర్ అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోశారని గుర్తు చేశారు. అసలు బండి సుంజాయ్ నీకు సిగ్గుందా? మానవత్వం ఉందా? లేదా ఇంకా నువ్వు కరీంనగర్ కార్పరేటర్ అనుకుంటున్నావా అంటూ ధ్వజమెత్తారు. అసెంబ్లీ అమరవీరుల స్తూపం సాక్షిగా మీ ముక్కు నేలకి రాసి బేషరత్ గా గద్దర్ కి, తెలంగాణ సమాజానికి, సారి చెప్పాలన్నారు. బీజేపీ వాళ్ళ పాత్ర తెలంగాణ ఉద్యమంలో లేన్నందున మీకు గద్దర్ విలువ తెలియదన్నారు.

తెలంగాణ గీతపనివారాల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర గీతా పని వార్ల సంఘం నూతన క్యాలెండర్ మంగళవారం మల్కాజిగిరి ఇందిరా నగర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గీతా పని వారల సంఘం ప్రధాన కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి సొసైటీకి వన పెంపకం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీ.సాయి కిరణ్ గౌడ్, బి. యాదగిరి, టి.సంతోష్ గౌడ్, ఎ.సందీప్, కె.రామ చంద్రయ్య గౌడ్, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల కల్పనపై ఫోకస్

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఫోకస్ పెట్టినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వెల్లడించారు. మంగళవారం ఉప్పల్ సర్కిల్ చిలుకా నగర్ వార్డులో సుమారు రెండు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మోడల్ గ్రేవ్ యార్డ్‌ను డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌లతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం చిలుకా నగర్‌లోని పలు కాలనీల సమస్యలపై కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ వివరించగా వాటిని డిప్యూటీ మేయర్, అధికారులతో కలిసి సమస్యలను పరిశీలన చేసిన మేయర్ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ పిస్తా హౌస్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు కాలనీలో ఓపెన్ డ్రైనేజీ స్థానంలో బాక్స్ డ్రైనేజీ పనులకు అంచనా ప్రాతిపదికకు అనుగుణంగా నిధులు మంజూరు కాలేదని, ఇంతకు ముందు ప్రతిపాదించిన అంచనా మేరకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కోరగా, అవసరమైన నిధుల మంజూరుకు నివేదిక పంపాలని జోనల్ ఎస్.ఈని మేయర్ ఆదేశించారు. చిలుకా నగర్ మెయిన్ రోడ్డు పోచమ్మ టెంపుల్ చౌరస్తా వద్ద బోడుప్పల్ మున్సిపాలిటీ నుండి స్ట్రామ్ వాటర్ డ్రైన్, ఇండస్ట్రియల్ స్ట్రామ్ వాటర్ ఓవర్‌ఫ్లో నీరు కాలనీలోకి రావడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ వివరించి, మేయర్ పరిశీలన చేసి వాటర్ వర్క్స్ ఎండితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. నాచారం చెరువు మత్తడి నుండి ఓవర్ ఫ్లోతో కాలనీలోకి చెరువు నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మల్లికార్జున్ నగర్ కాలనీవాసులు మేయర్‌కు విన్నవించగా వరద నివారణకు చర్యలు తీసుకోవాలని జోనల్ ఎస్.ఈని ఆదేశించారు. మిస్టాట్ ఎన్‌క్లేవ్ నాలా క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో ఉన్న క్రాసింగ్ బ్రిడ్జి వరద నీరు నిలిచి దెబ్బతిన్న నేపథ్యంలో ఎత్తయిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ ఎస్.ఈ నిత్యానంద, ఉప్పల్ సర్కిల్ డి.సి ఆంజనేయులు, జోనల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

మన ప్రాణాలకు మనమే భద్రత కల్పించుకోవాలి

- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇంటి వద్ద మీ కోసం ఎదురు చూసే మీ కుటుంబ సభ్యులు ఉంటారనే ఆలోచన మీలో ఉండాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణంలోని అల్మాస్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీస్, వెస్టర్న్ ఆంధ్ర టోల్వేస్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ మన ప్రాణాలకు మనమే భద్రత కల్పించుకోవాలని, ప్రమాదాలు ఏ రూపంలో వస్తాయో తెలియదని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్య భీమా తీసుకోవాలని, ఆరోగ్య భీమా ఉంటే ఆరోగ్య సమస్యలకి ఇబ్బందులు రావన్నారు. సెల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయరాదని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో విద్య వైద్యం పటిష్టంగా తయారు చేస్తున్నాం అన్నారు. మిమ్మల్ని నేను ఓటు బ్యాంకుగా భావించడం లేదని, శ్రమజీవులుగా, నా ఆత్మీయులుగా భావిస్తున్నాను అని ఆయన చెప్పారు. మీరు నిబంధనలకు లోబడి ఉంటే మీకు ఏ సమస్యలు రావని, నిబంధనలకు విరుద్ధంగా పోతే చట్టం తన పని తాను చేస్తుందని హెచ్చరించారు. ప్రతి ఆటో డ్రైవర్ , క్యాబ్ డ్రైవర్ నాకు సంబంధించిన వారేనని, మీకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా అధికారులతో కలిసి కార్యరూపం దాల్చే ప్రయత్నం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఒక నియమం పెట్టుకోని తప్పక రూల్స్ పాటించాలని ఆయన సూచించారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని కూడా ఎక్కువ ఆసుపత్రులలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామ న్నారు. ఈ సందర్భంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలను, తెలంగాణ ఫోర్ వీల ర్స్ డ్రైవర్స్, హైర్ వేహికిల్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో భద్రతా మాసోత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిషన్ , వాసుదేవ్, వర్టికల్ డిఎస్పీ సుదర్శన్, ట్రాఫిక్ సిఐ భగవంత్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ఆర్టీఎ సభ్యులు సలీం, జిల్లా ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, నాయకులు అజ్మత్ అలి, లీడర్ రఘు, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం వద్దు... హెల్మెట్లను ధరించండి : ఎమ్మెల్యే వీరవల్లి

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో ఎంవీఐ వాసు ఆధ్వర్యంలో చేపట్టిన భారీ హెల్మెట్ బైక్ ర్యాలీ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో జరిగిన హెల్మెట్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సదానంద్ గౌడ్, ఏసీపీ రంగస్వామి, సీఐ విజయకుమార్, పట్టణ ఉప రవాణా అధికారి వాసు, ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్ తో కలిసి హెల్మెట్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మితిమీరిన వేగం వల్ల యువతలో ప్రాణ నష్టం కలుగుతుందని, పరిమిత వేగమే ప్రాణానికి హద్దు అని తెలుపుతూ, యువకులు చెడు వ్యసనాల వలన, చెడు దారుల్లో ప్రయాణిస్తూ, మద్యం సేవించి మితిమీరిన వేగంతో రోడ్లపై వేగంగా ప్రయాణిస్తూ తమ ప్రాణాల పైకి తెచ్చుకోవడమే కాకుండా, ఎదుటివారి ప్రాణాలు కూడా పోయే విధంగా చెలగాటమాడుతున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే చిన్నతనం నుంచి రోడ్డు భద్రత నియమాలను పాఠ్యాంశంలో చేర్చి వారికి రోడ్డు భద్రత నియమాలు ఒంటపట్టే విధంగా నేర్పించాలని అన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల వాహనాలు నడపవద్దని, మితిమీరిన వేగాన్ని వదిలివేయాలని, తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, కారు, జీప్ లో నడిపే వంటి వారు తప్పకుండా సీటు బెల్టు ధరించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తెలుసుకొని వాటిని ఆచరణలో పెట్టాలని, ఒక కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబం ఎంత నష్టపోతుందో మనం విలువ కట్టలేమని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సదానంద గౌడ్ మాట్లాడుతూ... జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల సందర్భంగా ప్రజలందరికీ రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించి ప్రయాణంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం సాఫీగా జరిగే విధంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఏసిపి రంగస్వామి మాట్లాడుతూ ప్రజల్లో చైత న్యం తీసు కురావడానికి జాతీయ భద్రత వారో త్సవాలు ఎంతో గాను ఉపయోగపడ తాయని అన్నారు. ఎంవిఐ వాసు మాట్లాడుతూ రోడ్డు భద్రత, రోడ్డుపై జరిగే ప్రమాదాలను నివారిం చడానికి హెల్మెట్లను కచ్చితంగా ధరించాలని, నాలుగు చక్రాల వాహన దారులందరూ సీటు బెల్టులు కచ్చి తంగా పెట్టుకోవాలని వాహన దారుల జీవితాలతో పాటు వారి కుటుంబ క్షేమం కూడా ముఖ్యం కాబట్టి రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఖచ్చితమైన నియమాలను పాటించాలని అందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, రఘునాయక్, ఎస్సై బలరాం, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, బాలరాజ్ గౌడ్, ముబారక్, ఖదీర్, అశోక్, విజేందర్ రెడ్డి,జమీల్, కబీర్, పలువురు వాహనదారులు, ప్రజలు, నాయకులు కార్యకర్తలు, వివిధ శాఖ పోలీసులు పాల్గొన్నారు.

సంస్థాగత సమన్వయాన్ని పెంపొందించాలి

- పిసిబి ఎంప్లాయిస్ అసోసియేషన్ 2025 డైరీని ఆవిష్కరణలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ 2025ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి తన ఛాంబర్‌లో అధికారికంగా మంగళవారం విడుదల చేశారు. సంస్థాగత సమన్వయాన్ని పెంపొందించడంలో, రాబోయే సంవత్సరానికి రాష్ట్ర పర్యావరణ లక్ష్యాలతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియం త్రణ మండలి ఉద్యోగులు పని చేయాలన్నారు. పిసిబి ఎంప్లాయిస్ అసోసి యేషన్ డైరీ 2025 ఉద్యోగుల కోసం కీలకమైన తేదీలు, అంతర్గత సంఘ టనలు, పాలసీ అప్‌డేట్‌లు, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కార్యక్రమాలలో వారి పాత్రలకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని కలిగి ఉండే కీలక వనరుగా పని చేస్తుందన్నారు. టిజిపిసిబి అసోసియేషన్ డైరీని విడుదల చేసినందుకు, రాష్ట్ర ప్రభుత్వం నుండి గుర్తింపుతో పాటు కొనసాగిస్తున్నందుకు ప్రధాన కార్యదర్శికి అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీవాత్సవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.కృపానంద్, జాయింట్ సెక్రటరీ సుమతి జగన్నాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వప్న, కల్చరల్ సెక్రటరీ అరుణ, ఇతర అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు, బోర్డు సీనియర్ అధికా రులు హనుమంత్ రెడ్డి, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.విన య్ కుమార్ నాయుడు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట్ నర్సు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడాలి

- ఏఐఎస్ఎఫ్ డైరీ ఆవిష్కరణలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడాలని విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ముద్రించిన 2025 డైరీనీ హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని విద్య కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో పలు సమస్యలపై మురళి, ఏఐఎస్ఎఫ్ నాయకులతో చర్చించారు. విద్యారంగం బలోపేతం కోసం సూచనలు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యా కమీషన్ సభ్యులు ప్రొ.పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, చారకొండ వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోత్ రఘురాం, గ్యార క్రాంతి, గ్యార నరేష్, రెహమాన్, కాసోజు నాగజ్యోతి, రాజు, లెనిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్ గౌతం

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : డిజిటల్ క్లాసులలో వచ్చే ఇంగ్లీషు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఉండేలా చూసుకోవాలని హెడ్ మాస్టర్‌కు సూచిస్తూ, పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం భోదించారు. మంగళవారం మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ డిజిటల్ తరగతులను పరిశీలించి అందులోని ఇంగ్లీషు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు సూచించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటగది, డైనింగ్ హాల్‌ను తిరిగి పరిశీలించారు. అవసరమైన సలహాలను సూచనలను హెడ్ మాస్టర్‌కు కలెక్టరు సూచించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. ల్యాబ్‌లోని పరికరాలను పరిశీలించి, వినియోగంలో లేని వాటిని రిప్లేస్ చేయించాలని సూచించారు. లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులలో కొంత మంది చదువుతున్న ఇంగ్లీషు పాఠాన్ని తెలుగులో చెప్పమనగా, విద్యార్థులు చదివి అర్థవంతంగా వివరించగా కలెక్టరు సంతోషించి వారికి పెన్నులను బహూకరించారు. ప్రక్కనే ఉన్న అంగన్వాడీని సందర్శించి పరిశీలించారు. అక్కడే ఉన్న వెటర్నరీ ఆసుపత్రిని కలెక్టరు వెటర్నరి డాక్టరును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి నూతన్ కల్‌లోని పల్లె దవఖానాను కలెక్టరు తనిఖీ చేసారు. పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ఔట్ పేషంట్స్ శాతాన్ని పెంచాలని కలెక్టరు ఆదేశించారు. గ్రామంలో జనాభా ఎంత అని డాక్టరు, ఎఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఓపిని పెంచేం దుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దవఖానాలోని రిజిష్టర్లను పరిశీలించి తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి, డిఎం అండ్ హెచ్ఓ రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, ఎంఆర్ఓ శైలజ, ఎంపిడిఓ వసంత లక్ష్మి ఉన్నారు.

చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు : ఎమ్మెల్యే కేపీ

విశాలాంధ్ర - దుండిగల్ : అల్లం చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద వెల్లడించారు. నియోజకవర్గం 132 - డివిజన్ అంగడిపేట నందు అల్లం చెరువును మంగళవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా సుమారు 40 లక్షల రూపాయల వ్యయంతో సుందరీకరించిన అల్లం చెరువును సమీప కాలనీ వాసులకు ఆహ్లాద వాతావరణాన్ని అందించేందుకు సుందరీకరించామని, ఈ అల్లం చెరువులో మురుగు నీరు కలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, నాయకులు అనిల్, పులి మహేష్, కృష్ణ ముదిరాజ్, జి.హెచ్.ఎం.సి. ఈఈ లక్ష్మీ గణేష్, డిఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, వాటర్ వర్క్స్ డీజిఎం రాజేష్, మేనేజర్ అనుషా తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ త్రిలేశ్వర్‌కు కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్ గారికి ఉత్తమ కమిషనర్ అవార్డు వచ్చిన సందర్భంగా మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కమిషనర్‌తో చర్చలు జరిపి, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా నాయకులు, అలాగే పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపుతో పలువురు దాతలు స్పందిస్తున్నారు. ఈ నేపద్యంలో ఫరూఖ్ నగర్ మండలం చింత గూడ గ్రామంలోని సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాని శైలేష్ కుమార్ అగర్వాల్ నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ కళాశాలకు 11 లక్షల రూపాయలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్య అభివృద్ధికై సహకరిస్తున్న దాతల సహకారంతో మరువలేనిది అని పేర్కొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును అందించడం కోసం తన వంతు ప్రయత్నంగా జూనియర్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్య,వైద్యానికి పెద్ద పీట వేస్తానని తెలిపారు. అనంతరం శైలేష్ కుమార్ అగర్వాల్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అగ్గనూర్ బస్వ%శీ%,శ్రీకాంత్ రెడ్డి, సయ్యద్ సాదిక్ ,శేఖర్ గౌడ్,గిరి గౌడ్ తుపాకుల శేఖర్, శ్రీహరి,సీత రాములు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: అనారోగ్యాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం వంటిదని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొం దిన పలువురు నిరు పేదలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా బాధితులకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి మంజూరు చేయించారు. మంగళవారం 127 డివిజన్ ఇందిర గాంధీ నగర్ బాచుపల్లి సాయి నగర్ చెందిన జన శిరోమణి 60,000రూ, మ మత రూ. 1,00116 ల కళ్యాణ లక్ష్మి, ఉమకి రూ. 47,500, మం జూరు పత్రాలను అందజేశారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెరికె శివ, తైలం శ్రీనివాస్, ఎన్ ఎమ్ సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, శామీర్ పెట్ ప్రకాష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గొంగుల నవీన్, అది రెడ్డి, లక్ష్మి రెడ్డి, మాధవి రాణి, నీల గుప్తా, చిన్నమ్మ, జానకి, ధనలక్ష్మి, కోమల పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాల అమలు

విశాలాంధ్ర - ఆమన గల్లు : కల్వకుర్తి నియోజక వర్గంలో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్ ఆర్ ఎం గ్రాంట్ క్రింద రూ. 15, 59, 40 కోట్లను మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం ఆమనగల్లు లో మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి 3.10 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు 500 కోట్ల రూపాయలతో ప్రణాళికలను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.

డివిజనల్ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతి

విశాలాంధ్ర - ఆమనగల్లు : నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో డివిజినల్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేయాలనీ మంగళవారం పట్టణ కేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ డివిజినల్, సబ్ రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరి, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటు చేయాలనీ వినతి కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆమనగల్లు పట్టణంలో డివిజినల్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. వినతిపత్రం అందజేశిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ, జిల్లా నాయకులు గుర్రం కేశవులు, కృష్ణ నాయక్, ఖాదర్ ఖాద్రి, అబ్దుల్ ఖాదర్, రహీం, ఎన్ఎస్యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, బాబా పాల్గొన్నారు.

పుణ్య జలాలతో పిఎంసి కార్పొరేషన్ కార్యాలయాన్ని శుద్ధి చేసిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో బిజెపి కార్పొరేషన్ తూర్పు అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాల నుంచి కార్పొరేషన్ కి పట్టిన సకల అరిష్టాలు మరియు దోషాలు జనవరి 25 తారీకు రోజున తొలగిపోయాయని భవిష్యత్తులో ఇలాంటి దోషాలు అరిష్టాలు జరగవద్దని కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న దేవాలయంలో మంగళవారం ఉదయం పూజ చేసి అనంతరం కార్పొరేషన్ కార్యాలయం మొత్తాన్ని కుంభమేళ నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో పురోహితులు వేదమంత్రాలు చదువుతున్న తరుణంలో బిజెపి నాయకులు కార్యాలయాన్ని నది జలాలతో సంప్రోక్షణ చేసిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు అధికార దాహంతో ప్రజల సమస్యలు పట్టించుకోని గత పాలకులు నేటితో కార్పొరేషన్ విముక్తి కలిగిందని ఇకనైనా కార్పొరేషన్ ఉన్నత స్థాయి అధికారులు మరియు పదాధికారులు ఎలాంటి ప్రలోభాలకు లో పడి పని చేయకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు కోసం పనిచేయాలని ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బండారు పవన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతి జయపాల్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కన్నెబోయిన రాము యాదవ్, మాజీ కౌన్సిలర్ బాలరాజు, సీనియర్ నాయకులు శేషగిరి రావు, రాణి సుధాకర్, రజిని రెడ్డి, మెట్టు మహేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, తలసాని యాదగిరి రెడ్డి, మెట్టు పవన్ గౌడ్, బుల్లెట్ సాయి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదిరింపు

విశాలాంధ్ర - కాప్రా : నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు మరో సారి బాంబు బెదిరింపు అంటూ సమాచారం రావడంతో పాఠశాలలో ఒక్కసారిగా తీవ్ర కలకల రేగింది. మంగళవారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మెయిల్కు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు స్కూల్లో బాంబులు పెట్టినట్లు సమాచారం పంపారు. దీంతో పాఠశాల యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు బాంబు స్క్వాడును రప్పించి స్కూల్ మొత్తం తనిఖీలు చేపట్టారు. చివరకు బాంబు లేదని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సమాచారంతెలియడంతో అప్పటికే పాఠశాల యాజమాన్యం చిన్న క్లాసుల పిల్లలను వారి ఇళ్లు పంపించారు. బాంబు అంటూ వార్తాకథనాలు సోషల్మీడియాలో రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే స్కూల్ కు బాంబు పేరుతో బెదిరింపు మెయిల్స్ రావడం ఇది రెండో సారి. గత నెలలో కూడా ఇలాంటి సమాచారమే మెయిల్ కు రావడంతో పాఠశాల యాజమాన్యం సమాచారంతో పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టినా చివరకు అది ఫేక్ అని తేలింది. ఈ సారి కూడా ఇదే తరహాలో వచ్చిన సమాచారంతో తనిఖీలు చేపట్టిన పోలీసులకు ఎలాంటి బాంబులు లభించలేదు.ఇది కూడా ఆకతాయిల పనే అని తేల్చారు. అయితే గతంలో వచ్చిన మెయిల్ ఫేక్ అని తేలినపుడు పోలీసులు , స్కూల్ యాజమాన్యం దీనిపై తక్షణమే ఆరా తీయాల్సి ఉందంటున్నారు. ముఖ్యంగా రైళ్లలో బాంబులు పెట్టామంటూ ఫేక్ కాల్స్ వచ్చినా, ఫేక్ మెయిల్స్ వచ్చినా వాటిపై పోలీసులు తక్షణమే విచారణ చేపట్టి అవి ఎక్కడ నుంచి వచ్చాయి...? ఏమెయిల్ నుంచి పంపారు. ? ఆ మెయిల్ ఇప్పుడు ఎవరి అకౌంట్లో పని చేస్తుందనే విషయాలను పరిశీలించి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో ఇలాంటి సంఘనటలకు బాధ్యులైనవారిని అరెస్టు చేయడంతో ప్రస్తుతం రైళ్లలో బాంబులు పెట్టామంటూ వచ్చే ఫేక్ మెయిల్ పూర్తిగా తగ్గాయి. ఇదే క్రమంలో స్కూల్ యాజమాన్యం, పోలీసులు కూడా ఇదే తరహాలో ప్రయత్నించి గతంలో ఫేక్ మెయిల్ చేసిన వ్యక్తిని గుర్తించి ఉంటే ఇప్పుడు సంఘటన రిపీట్ అయ్యేది కాదంటున్నారు. చుట్టు పక్కల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంటి చాలా పాఠశాలలు ఉన్నాయని, అయితే ప్రతి సారీ ఈ స్కూల్కే బాంబు బెదిరింపులు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అయితే బాంబుల పేరుతో వచ్చేబెదిరింపు మెయిల్స్ టైమ్లో పాఠశాల యాజమాన్యం అందులో చదువుతున్న పిల్లల పేరెంట్స్కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోప్యత పాటిస్తారని, ఇందులో ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి బెదిరింపు మెయిల్స్తో పిల్లలను, తల్లిదండ్రులను భయాందోళనకు గురిచేయరాదని పలువురు పేరెంట్స్ కోరుతున్నారు.

కేసీఆర్ సొంత జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థి లేరా?
ఎంపీ రఘునందన్ రావు సూటి ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ... కెసిఆర్ సొంత జిల్లాలో బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థి లేరా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. మంగళవారం మెదక్ పట్టణంలో మీడియా తో మాట్లాడారు. టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖం చాటేసే దీనస్థితికి వచ్చిందన్నారు.వరంగల్, నల్గొండ ,ఖమ్మం ఎమ్మెల్సీ అభ్యర్థిని పెట్టమంటే పక్క పార్టీ నుండి తెచ్చుకుని 50 కోట్లు ఖర్చుపెట్టి నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే ఇన్చార్జిగా పెట్టి టిఆర్ఎస్ పార్టీ నానా హంగామా చేసింది అన్నారు. తెలంగాణ ఉద్యమంలో గన్ డౌన్, పెన్ డౌన్ అన్న తెలంగాణ ఉద్యమకారుడైన దేవిప్రసాద్ రావు మీ మాటలు నమ్మి పదేళ్ల ముందు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. దేవిశ్రీప్రసాద్ పైన పైసలు పెట్టడానికి యువరాజు మనసు ఒప్పుకోవడం లేదా అని పరోక్షంగా కేటీఆర్ నుద్దేశించి అన్నారు. ఏమి లేని చోట ఎగిరి ఎగిరి పడుతున్నారని మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామబాద్ అభ్యర్థి ఎక్కడున్నారని ప్రశ్నించారు. వరంగల్, మహబూబ్ నగర్, ఖమ్మంకు పెట్టగలిగిన మీరు ఎందుకు మీ సొంత జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పెట్టుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్ పార్టీని బిఆర్ఎస్ పార్టీగా మార్చిన అనుక్షణం టిఆర్ఎస్ కు సిఆర్ఎస్ ఇచ్చారని పేర్కొన్నారు. మెదక్ లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ అనేది ఈ రాష్ట్రంలోనే కాదు ఈ జిల్లాలో లేదు అనడానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల తాజా పరిస్థితి నిదర్శనం అన్నారు. వెంట జిల్లా బీజేపీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, నియోజకవర్గం ఇంచార్జి పంజా విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ తదితరులున్నారు.

మహబూబ్ నగర్ ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పునరుద్ఘాటించారు. మహబూబ్ నగర్ పట్టణంలోని మెట్టుగడ్డ ప్రాంతంలోని ప్రభుత్వ డిఎల్టిసి/ఐటిఐని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న కోర్సు వివరాలను, వారికి ఐటిఐ పూర్తిచేసిన తర్వాత ఎలాంటి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఐటిఐ ప్రిన్సిపాల్ శాంతయ్య ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐటిఐ పూర్తి చేసిన వారికి న్యాప్ ద్వారా అవకాశం కల్పించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, మన పట్టణానికి చెందిన జయరామ ఇంజనీరింగ్ మోటార్స్ లో ఆధ్వర్యంలో అప్రెంటిస్ ప్రోగ్రాంతో పాటు, ద్యుయల్ సిస్టమ్ శిక్షణ, ఆన్ జాబ్ శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. జయరామ ఇంజనీరింగ్ మోటార్స్ వారు 50 మందికి వివిధ ట్రేడ్ లలో నూతనంగా వచ్చే విద్యార్థులను అడాప్ట్ చేసుకుని వారికి శిక్షణ ఇస్తున్నారని ఎమ్మెల్యేకి చెప్పారు. నూతనంగా ప్రవేశపెట్టే కోర్సుల కోసం, అడ్మిషన్స్ పెంచుట కోసం పాఠశాల లో డ్రాప్ అవుట్స్ అయిన విద్యార్థులకు, మరియు పదవతరగతి అనంతరం ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో అవేర్ నెస్ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జయరామ ఇంజనీరింగ్ మోటార్స్ అధినేత రామిరెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, నాయకులు హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, సుధాకర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఇమ్రాన్ ఖురేషీ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జాతర ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే యెన్నం

- ఫిబ్రవరి 7 నుంచి మార్చి 16 వరకు మన్యం కొండ బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 12న రథోత్సవం
- జాతరకు ముఖ్యమంత్రి వచ్చే అవకాశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మన్యంకొండ దేవస్థానం ప్రతిష్టను పెంచే విధంగా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లు చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఐడిఓసిలో మన్యంకొండ జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7 వ తేదీ నుంచి మార్చి 16 వరకు మన్యం కొండ జాతర జరుగుతుందని, ఫిబ్రవరి 12 న రథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు. రంగరంగ వైభవంగా మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి జాతర నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కురుమూర్తి స్వామి జాతరకు వచ్చారని, అలాగే మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవాలని వారికి సంకల్పం ఉంది కాబట్టి అధికార యంత్రాంగం అప్రమత్తతతో ఉండి ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. దేవాలయ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయి అధికారుల బృందాన్ని మన్యం కొండకు పంపించారని, దేవాలయ చైర్మన్ మరియు ఎ.ఓ గారితో అధికారుల బృందం చర్చించారని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ విసిట్ చేస్తారని ఆయన తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ప్రక్క రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని వెళ్తారని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. జాతరకు వచ్చే మంత్రులు, విఐపి మువెంట్ కు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. గత సంవత్సరం ఏమైనా లోటుపాట్లు జరిగి ఉంటే వాటిని సరిచేసుకోవాలని, రవాణా, తాగునీటి సౌకర్యం, విద్యుత్, షెడ్లతో పాటు భక్తులు స్నానాలు ఆచరించుటకు తగు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఆర్టీసి వారికి బస్సులు పెంచాలని కోరడం జరిగిందని, ఆర్టీసీ చైర్మన్ తో మాట్లాడడం జరుగుతుందని , పోలీసులు, ఆర్టీఓ సమన్వయంతో పనిచేయాలని, మహబూబ్‌నగర్ మున్సిపల్ అధికారులు కూడా జాతర ఏర్పాట్లలో పాలు పంచుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ , జిల్లా ఎస్పీ డి.జానకి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మన్యంకొండ దేవస్థానం ధర్మకర్త అల హరి మధుసూదన్, ఇఓ శ్రీనివాస్ రాజు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయ కులు బుద్దారం సుధాకర్ రెడ్డి, బెజ్జుగం రాఘువేం ధర్, సాదతుల్లా, శ్రీనివాస్ యాదవ్, అజ్మత్ ఆలి,, అధికారులు, దేవస్థానం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల పక్షం అభ్యుదయ అక్షరం విశాలాంధ్ర చరిత్ర

విశాలాంధ్ర - పినపాక : ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో నిబద్ధత, కార్యదీక్ష, నిష్పక్షపాతంగా ప్రజల పక్షం నిలిచి నిరాఘాటంగా కొనసాగుతున్న అభ్యుదయ అక్షర జాతీయ పత్రిక విశాలాంధ్ర చరిత్ర అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొనియాడారు. మంగళవారం మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ ప్రజా భవన్ కార్యాలయంలో విశాలాంధ్ర పత్రిక క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పత్రిక నేపథ్యాన్ని గుర్తు చేశారు. సిపిఐ పార్టీ అనుబంధ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి దశనుంచే తాను ఉద్యమాల్లో కొనసాగిన నేపథ్యంలో విశాలాంధ్ర పత్రిక చేదోడుగా నిలిచిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వెలకట్టలేని ఎంతోమంది ఉద్యమకారులు, కవులు, రచయితలు, అభ్యుదయ వాదులకు దశాబ్దాల నుంచి వేదికగా నిలిచి ఎంతో ప్రోత్సాహాన్ని, గుర్తింపును అందించిన ఏకైక పత్రిక అన్నారు. ఏడున్నర దశాబ్దాల నుంచి అప్రతిహతంగా అభ్యుదయ భావజాలనికి కట్టుబడి నిబద్ధతగల ఎడిటర్లు, పాత్రికేయులతో దిశనిర్దేశం చేసే ఎడిటోరియల్ రచనలు, అనుదిన కథనాలతో సమాజంలో చైతన్యం నూరుతూ మేలుకొలుపుతున్న పత్రిక అన్నారు. బాధిత ప్రజల పక్షం నిలుస్తున్న వేదిక విశాలాంధ్ర అన్నారు. కాగా పినపాక నియోజకవర్గంలోని మండలాల రెవెన్యూ, ఎంపీడీవో అధికారులతో పాటు పోలీస్ అధికారులు తమ కార్యాలయాల్లో విశాలాంధ్ర పత్రికను ఆవిష్కరించారు. కరకగూడెం మండలం ఇన్చార్జి ఎంపీడీవో, దేవ వరకుమార్, పినపాక లొ తహసిల్దార్ అద్దంకి నరేష్, మణుగూరులో తహసిల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, మణుగూరులొ డిఎస్పి రవీంద్ర రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, అశ్వాపురం లొ తహసిల్దార్ స్వర్ణ, బూర్గంపాడులొ తహశీల్దార్ ముజాహిద్, ఐ టి సి పి ఆర్ ఓ చంగల్ రావుల చేతుల మీదుగా విశాలాంధ్ర ఆవిష్కరించారు. ఈ అభ్యుదయ పత్రిక నేప థ్యాన్ని అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ విశాలాంధ్ర ఆర్సి ఇంచార్జ్ గుమాసు శంకర్, పినపాక ప్రెస్ క్లబ్ గుండు నరసింహమూర్తి, పాత్రికేయులు బూరా శంకర్, నాగేంద్ర, బృహస్పతి, కట్టా శీను, మహేష్, సుధాకర్ రెడ్డి, మణుగూరు మండల ప్రెస్ క్లబ్ కార్యదర్శి మారుతి శ్రీనివాసరావు (ఆంధ్రప్రభ), శ్యామ్ (సాక్షి), రవి కుమార్ (99 టివి), ఉపేందర్ (రాజ్ న్యూస్), వేంకట్, అనిల్ జ్యోతి పాల్గొన్నారు.

దివ్యాంగ బాలికకు హెూప్ స్టెప్స్ ఫౌండషన్ వీల్ చైర్ వితరణ

విశాలాంధ్ర - బయ్యారం : నిరుపేద దివ్యాంగ బాలికకు హెూప్ స్టెప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బయ్యారం మండల కేంద్రంలో వీల్ చైర్ ను వితరణగా అందించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ నాగవెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పుట్టుకతోనే దివ్యాంగురాలైన అపర్ణ కనీసం వీల్ చైర్ కొనే స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ఆ కుటుంబం దాతల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అపర్ణ జీవన శైలిని చూసి చలించిపోయినట్లు చెప్పారు. దింతో వెంటనే వీల్ చైర్ ను వితరణగా అందించిన్నట్లు తెలిపారు. ఈమె కుటుంబం మొత్తం చాలా కష్టాలతో నెట్టుకొస్తుందన్నారు. అలాంటి కుటుంబంలో ఈమెకు వీల్ చైరు అందించడం తమ వంతు బాధ్యతగా భావించామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో హెూప్ స్టెప్స్ ఫౌండేషన్ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు తాము 150 పై చీలుకు వీల్ చైర్లను అందించామన్నారు. అపర్ణకు అన్ని విధాలుగా సహయ సహకారాలు అందిస్తామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెూప్ స్టెప్స్ సభ్యులు బషీర్, శ్రీనివాస్, శ్రీకాంత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసింది ఏమి లేదు

విశాలాంధ్ర - ఘట్‌కేసర్ : పదేళ్ళ బిఆర్ఎస్ పార్టీ నాయకులు దోచుకునుడు తప్ప పేదలకు ఒక రేషన్ కార్డు ఇచ్చిన దాఖలలు లేవని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్ మండిపడ్డారు. పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అన్నోజిగూడలోని తన వ్యక్తిగత కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలలోనే ప్రజలకు ఎన్నికలలో ఇచ్చన హామిల మేరకు దశల వారిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. పదేళ్ళు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమిలేదని, ధనక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను దివాళ తీయించారని, దళిత బంధు, బిసి బంధు అంటూ బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పథకాలు వర్తింప జేసిందు తప్ప అర్హులైన పేదలకు ఏమిలేదని మండిపడ్డారు. ప్రజలకు పథకాలు అందకుండా బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, రేషన్ కార్డులకు నిరంతరాయంగా అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి పక్షాల విమర్శలను తిప్పి కొట్టాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త ప్రభ్హువ చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించే విధంగా ప్రజలకు దగ్గరవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపిటీసి పులకంటి భాస్కర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు భోజిరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు పోలగోని సహదేవ్ గౌడ్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు సర్కిల్‌లో ఎక్సైజ్ శాఖ దాడులు

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ సిఐ బద్యనాథ్ చౌహన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహిం చారు.. తనిఖీల్లో భాగంగా మాడ్గుల మండలం జగ్గు తాండా, జరుపుల తాండా, మాడ్గులలో నాటుసారా, సర ఫరా, అమ్మకం, బెల్లం పానకం దారు లపై తనిఖీలు నిర్వహించగా ఐదుగు రిపై పై కేసులు నమోదు చేసినట్లు ఆమనగలు ఎక్సైజ్ సీఐ భద్యా చౌహాన్ చెప్పారు. 8 లీటర్ల సారా,25కేజీల బెల్లం, 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు సిఐ తెలిపారు. ఎవరైనా నాటుసార, బెల్లం పటిక అమ్మిన అక్రమంగా తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని, తరలించినట్లు గుర్తిస్తే 8712658742, 9000571671, నెంబర్లను సంప్రదించగలరని, సమాచారం అందజేసిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.దాడులలో ఎస్ఐ అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, దశరథ్, బాబు, సురేష్, ఉన్నారు.

రోడ్డు భద్రత పాటించడం అందరి బాధ్యత

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : రోడ్డు భద్రత నియమాలు పాటించడం మన అందరి బాధ్యతని జిల్లా ఎస్పీ సుదీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పట్టణ కేంద్రంలో భారీ బైక్ ర్యాలీని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జెండా ఊపి ప్రారంభించి,బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాల నుంచి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో 60 నుంచి 70 శాతం యువతే ఉన్నారని అన్నారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల కుటుంబానికి కలిగే నష్టాన్ని ఎవరు పూడ్చలేరని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు . జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించి సహాయం చేస్తున్న శ్రీనివాస్ అనే యువకుడిని సన్మానం చేసి హెల్మెట్ ను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ సరవయ్య, ఎస్బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, బయ్యారం సీఐ రవి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ఇన్స్పెక్టర్ శంకర్,ఇతర అధికారులు,పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపును ఒప్పుకోవద్దు

- మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలపాల్సిందే
- మేధావుల మౌనం దేశానికి నష్టం
- టిఎన్జీఓ డైరీ ఆవిష్కరణలో ఎంపీ రఘునందన్ రావు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచితే మీ పిల్లలకే నష్టం.. ఎట్టి పరిస్థితిలో ఒప్పుకోవద్దని ఉద్యోగులకు ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. మెదక్ తెలంగాణ భవన్ లో మంగళవారం టిఎన్జీఓ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ, క్యాలెండర్ ను కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యే సునీతా రెడ్డి, టిఎన్జీఓ సెంట్రల్ కమిటీ మాజీ అధ్యక్షులు దేవి ప్రసాద్ రావుతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రఘునందన్ రావు మాట్లాడుతూ 30 రోజులలో అన్ని బేనిపిట్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు పెంచొద్దని టీఎన్జీవోలు తీర్మానం చేయాలని సూచించారు.ఉద్యోగులకు, జర్నలిస్టులకు హెల్త్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందరికీ సక్షేమం పథకాలు ఇస్తున్నారు. ఆదాయ పన్ను పరిమితి పెంచేలా, యునైటెడ్ పెన్షన్ సిస్టంలో సవరణలపైన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలపాలని కోరారు. గతంలో ఎమ్మెల్యేగా ఈ విషయం గురించి మాట్లాడినట్లు గుర్తు చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కలెక్టర్ దృష్టి సారిస్తే బాగుంటుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డిఎలు విడుదల చేయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రాబోయే 4 సంవత్సరాలలో 40 వేల మంది రిటైర్ అయితే 20 వేల కోట్లు కావాలి అందుకే వయసు పెంచే ఆలోచన ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. రిటైర్మెంట్ కాకపోతే ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రిపేరవుతున్న నిరుద్యోగులు ఏం కావాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... ఎవరి ఒత్తిడికి లొంగకుండా నిబంధనల మేరకు పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు. మెదక్ జిల్లాలి ఉద్యోగులు కష్టపడి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారరని కితాబిచ్చారు. నెల మొదటి రోజే వేతనం రావడం వల్ల ఇబ్బందిలేకుండా పోయిందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వి. సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... టిఎన్జీఓలు లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ఉద్యోగులు అన్నారు. సమస్యల ఒత్తిడితో ఉద్యోగులు నలిగిపోతున్నారని పేర్కొన్నారు మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలిపే వరకు ఉద్యోగుల ఉద్యమంలో ముందుంటానన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు , సకల జనుల సమ్మెలో టీఎన్జీవో ఉద్యోగుల పాత్ర కీలకం అన్నారు. ఉద్యోగుల మంచిగా ఉంటే ప్రభుత్వం బాగుంటుందన్నారు. టీఎన్జీవో కేంద్రం సంఘం మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ రావు మాట్లాడుతూ...

ప్రజా ప్రతినిధులు సీరియస్ గా ఆలోచిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. 14 నెలలుగా ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు వల్ల ఉద్యోగులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల కరువు భత్యం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో టిఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొంత నరేందర్, మినికే రాజ్ కుమార్, మాజీ అధ్యక్షులు శ్యాం రావు, శ్రీనివాస్ రెడ్డి, అనురాధ, ఇక్బాల్ పాషా, ఆరెల్ల రామాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అసోసియేషన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P. No. 162 / 2022
బిట్వీన్ :
వేమా పూర్ణచంద్ర శేఖర రావు ...పిటీషనర్
మరియు
వేమా వాసంతి ...రెస్పాండెంట్
టు:
వేమా వాసంతి, W/o. పూర్ణచంద్ర రావు, C/o. అన్నెబోయిన శ్రీకాంత్,ఎ.టి.యం. బజారు, వాటర్ ట్యాంక్ ప్రక్కన, వాడపల్లి, దామరచర్ల(మం), నల్గొండ జిల్లా.
పై కోర్టులో పిటీషనర్ (వేమా పూర్ణచంద్ర శేఖర రావు) రెస్పాండెంట్ (వేమా వాసంతి) అయిన మీ నుండి విడాకులు .... పొందునిమిత్తం పై నెంబరు పిటీషన్ దాఖలు చేసుకొనియున్నారు. ఇందు విషయమై మీకు అభ్యంతరములు ఉన్న యెడల మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ది.04-02-2025న ఉ॥గం॥ 10-30ని॥లకు పైకోర్టులో హాజరై తెలియపరచుకొన వలయును. అట్లు హాజరుకాని యెడల మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని శ్రీ కోర్టువారు నిర్ణయించుకొని పై పిటీషన్‌లో తదుపరి చర్యలు మీకు పరోక్షముగా తీసుకొనగలరని ఇందుమూలముగా పై కోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ఇవ్వడమైనది.

ఆర్. సాంబశివరావు, అడ్వకేట్
గురజాల, పల్నాడు జిల్లా. సెల్ : 9440438199

సూపర్ సిక్స్ అమలు చేయాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- రావుల కాంస్య విగ్రహం ఆవిష్కరించిన ఈడ్పుగంటి

విశాలాంధ్ర-మంగళగిరి/తాడేపల్లి: ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం సీపీఐ కార్యాలయం(వేములపల్లి శ్రీకృష్ణ భవన్) వద్ద ఏర్పాటు చేసిన అమరజీవి రావుల శివారెడ్డి కాంస్య విగ్రహాన్ని సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు చెప్పడం సరైనది కాదని అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఇప్పటివరకు చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సాకుతో సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని ఎన్నికల ముందు మాట్లాడిన చంద్రబాబు... అలవికాని హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులు, హడ్కో రుణాలు తీసుకువస్తూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం లాగానే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తోందని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గల కృష్ణపట్నం పోర్టు, గంగవరం పోర్ట్, బొంబాయి ఎయిర్‌పోర్ట్ అదానీవేనని, విద్యుత్ ఒప్పందాలు, సోలార్ ఒప్పందాలన్నీ ఆయనవేనన్నారు. లక్షల కోట్ల రూపాయల సంపద అదానీ, అంబానీ చేతిలో పెట్టారని విమర్శించారు. అంబానీలు, అదానీలకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వ విధానాలు మారాలని అన్నారు. మోదీ సర్కారుకు అంబేద్కర్‌పై విశ్వాసం లేదని, సాక్షాత్తు పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారని, క్రైస్తవులను, ముస్లింలను, ఇతర మతస్తులను ద్వేషిస్తున్నారన్నారు. 18 కోట్ల మంది ముస్లిం మైనార్టీలు ఉన్న మన దేశంలో కేంద్ర కేబినెట్‌లో ఒక్క ముస్లిం లేడన్నారు. ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో సిక్కులు, ముస్లింలు అగ్రభాగాన నిలిచి పోరాడారని గుర్తుచేశారు. ముస్లింలు, సిక్కులు లేకుండా ఏ పోరాటం జరగలేదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, లౌకికవాదాన్ని నిలబెట్టుకోవాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతం ఎర్రజెండాకు బలమైన కేంద్రమన్నారు. మతం, కులం, రాజకీయ పార్టీల పేరుతో ప్రజలను విడగొడుతున్నారని విమర్శించారు. శ్రమ, ఆర్థిక దోపిడీని, కులపీడనను నిర్మూలించేందుకు సీపీఐ ముందుకు సాగుతుందని తెలిపారు. మార్క్సిజానికి మరణం లేదని స్పష్టం చేశారు. రానున్న రోజులలో సీపీఐను బలమైన శక్తిగా తీర్చిదిద్దడానికి రావుల శివారెడ్డి విగ్రహావిష్కరణ ఈ ప్రాంత ప్రజలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా... గతమంత ఘన కీర్తి గలవాడ అని చెప్పిన వేములపల్లి శ్రీకృష్ణ ఈ ప్రాంతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉండి మంగళగిరి ప్రాంతానికి తాగునీరు అందించిన మహనీయుడని గుర్తుచేశారు. ఈ ప్రాంత పురోభివృద్ధికి బీజం వేసిన నేతని చెప్పారు. ఆ తరువాత నిమ్మగడ్డ రామ్మోహన్రావు, ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు తదితరులు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని అన్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు కావాలని, అమరావతి ఈ ప్రాంతంలో ఉండాలని పోరాడింది కమ్యూనిస్టు పార్టీ అని గుర్తుచేశారు. దేశంలో ధన రాజకీయాలు వచ్చాయని, ఒక ఎంపీ సీటుకు రూ.100 కోట్లు ఖర్చు పెడుతున్నారని అన్నారు. వీరు న్యాయ వ్యవస్థను, పాలనా వ్యవస్థను, పార్లమెంటు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అందరి జీవితాలు బాగుండాలని, అందరికీ స్వేచ్ఛ, సమానత్వం ఉండాలని సీపీఐ కోరుతుందన్నారు. మనకి ఎన్ని సిద్ధాంతాలు ఉన్నప్పటికీ ప్రజాతంత్ర వాదులందరూ కలిసి పోరాడవలసిన అవసరం ఉందని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన ప్రజా పోరాటాలలో రావుల శివారెడ్డి కీలకపాత్ర పోషించారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన సీపీఐ తన పోరాటాన్ని నిర్వహిస్తుందని అన్నారు. నేటితరం రావుల శివారెడ్డిని ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ రావుల శివారెడ్డి అలుపెరుగని పోరాట యోధుడని కొనియాడారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు ఆకాశాన్నంటాయని అన్నారు. ప్రజలు బ్రతకలేని దుర్భర స్థితిలోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రావుల శివారెడ్డి వంటి నేతల నిబద్ధత, త్యాగం, స్ఫూర్తిని, వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి జిల్లాలో కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి వై.చెంచయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఇస్టా జాతీయ కార్యదర్శి గని, మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, వైసీపీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి, మునగాల మల్లేశ్వర రావు, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, ఏరియా కమిటీ సభ్యులు మునునూరు సుహాస్, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, బొర్రా మల్లికార్జునరావు, మంగళగిరి పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, రావుల శివారెడ్డి సతీమణి రావుల బసవపున్నమ్మ, బత్తూరి మోహనరావు, కుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అర్జీల సమర్పణను
జయప్రదం చేయండి

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-పెదకూరపాడు: రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయంలో ఫిబ్రవరి 10న ఇళ్ల స్థలాల అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల అర్జీలు పూర్తి చేసే కార్యక్రమాన్ని ఫిబ్రవరి 9వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముప్పాళ్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్టీ సభ్యత్వాలను సకాలంలో పునరుద్ధరించాలని నాయకులకు సూచించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ కుడి కాలువ పక్కనే ప్రవహిస్తున్నప్పటికీ మంచినీరందని దుస్థితి ఉందని అన్నారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద తీసుకున్న భూములలో వెంటనే పరిశ్రమలు చేపట్టి... నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్, నాయకులు సీహెచ్ పానయ్య. మాదినేని సుధాకర్, నాగుల్‌మీరా, అల్లాభక్షు, సీహెచ్ పానయ్య, దొడ్డ రాజు, ఎం.బసవయ్య, దాసరి వినోద్ కుమార్, కొమ్మాలపాటి కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బాజీ, అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి పదవుల వ్యామోహం లేదు

వినయ్ విశ్వం



అలప్పుజా: వామపక్ష సంఘటన తన ప్రాధాన్యతలను ఎప్పటికీ మరువరాదని సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం నొక్కిచెప్పారు. రైతులు, కార్మికులు, కర్షకుల వంటి వర్గాల అవసరాలకు వామపక్షాలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధికారం ఎంత గొప్పదైనాగానీ పదవులపై సీపీఐకి ఏ మాత్రం వ్యామోహం లేదని వక్కాణించారు. కేరళ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వాన్ని మూడోసారి బలపర్చుకునేలా చారిత్రక మిషన్ చేపట్టాలని పిలుపునిచ్చారు. లెఫ్ట్ తన ప్రాధాన్యతలు మరిస్తే... అభిమానుల మనోభావాలు దెబ్బతింటాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రంలో వామపక్ష పురోగతికి విఘాతం కలుగుతుందని వినయ్ విశ్వం అన్నారు. అలప్పుజా వేదికగా సెప్టెంబరులో జరగబోయే సీపీఐ 25వ రాష్ట్ర సదస్సు కోసం రిసెప్షన్ కమిటీ ఏర్పాటు కోసం నిర్వహించిన సమావేశంలో వినయ్ విశ్వం మాట్లాడారు. సీపీఐ సదస్సు నిర్వహణకు నిధి సేకరణ పద్ధతిని వివరించారు. పార్టీ సభ్యుల ఇళ్లలో పెట్టిన విరాళాల పెట్టేల ద్వారా నిధి సేకరిస్తున్నట్లు తెలిపారు. 'ఒక్కో పెట్టేలో కనీసం రూ.వెయ్యి వస్తే రూ.2 కోట్లు సమకూరుతాయి. ఇది కోటా కాదు. లక్ష్యం నెరవేరకపోతే జరిమానాలు ఉండవు' అని వినయ్ విశ్వం అన్నారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ సమితి సభ్యుడు పి.ప్రసాద్ అధ్యక్షత వహించారు.

విజయసాయి అక్రమాలపై సమగ్ర విచారణ

- సీపీఐ సహాయ కార్యదర్శి జేవీఎస్ మూర్తి డిమాండ్
- 30, 31 తేదీల్లో విశాఖలో సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు

విశాలాంధ్ర-విశాఖ: రాజకీయాలను వదిలేసినంత మాత్రాన మాజీ ఎంపి విజయసాయి రెడ్డి చేసిన అక్రమాలు మాయమవ్వవని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి స్పష్టం చేశారు. గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను అడ్డం పెట్టుకొని విజయసాయి చేసిన అడ్డగోలు వ్యవహారాలన్నింటిపై హైకోర్టు సిట్టింగు జడ్జి నేతృత్వంలో విచారణ జరపాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. విశాఖ అల్లిపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విజయసాయి చేసిన అక్రమాలు, ఆగడాల కారణంగా విశాఖ బ్రాండ్ ఇమేజి మసకబారిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రతిపక్షంలో ఉండగా విజయసాయి రెడ్డి అక్రమాలపై సుప్రీంకోర్టుకు లేఖ రూపంలో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఇపుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా ఎందుకు విచారణకు ఆదేశాలు ఇవ్వలేకపోతున్నారని నిలదీశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు విజయసాయి రెడ్డి పై చేసిన ఆరోపణలపై ఇప్పటికీ తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సైతం సమాధానం చెప్పాలన్నారు. విజయసాయి రెడ్డి విశాఖపట్నం జిల్లా కేంద్రంగానే భారీగా అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇందులో విశాఖ నడిబొడ్డున దసపల్లా భూములకు 22 ఏ ను రద్దు చేసి తన బంధువులకు కట్టబెట్టేలా చేసిన వ్యవహారం, బీచ్ రోడ్డులో కార్తీకవనం భూములను అధికార బలంతో లాగేసుకొని రాడిసన్ బ్లూ హోటల్ కట్టించిన వ్యవహారం, కార్తీక వనం ఎదురుగా కొండపై బేపార్కు హోటల్ కూడా తన బంధువులకు దక్కేలా చేసిన అక్రమ వ్యవహారం, భీమిలి మండలం కాపులుప్పాడ దగ్గర 100 ఎకరాల భూమి దోపిడీ, ప్యాలెస్ నిర్మాణానికి రుషికొండలో జరిపిన తవ్వకాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్, రాయి విషయం లో విజయసాయి రెడ్డి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణపై, విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ లో సర్వే నెంబరు 1 లో తన కుమార్తె నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలతో విశ్వ విద్యాలయం కడతామని 120 ఎకరాల ప్రభుత్వ భూమిని కొట్టేసినట్టు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని మూర్తి డిమాండ్ చేశారు. విజయసాయి అక్రమాల్లో ఇవి కొన్ని మాత్రమేనని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా అక్రమాలతో వేల కోట్ల అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల ఉపకులపతుల నియామకాల కోసం నోటిఫికేషన్ ఇచ్చి నెలలు గడిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు తమ అనుంగులకు ఉపకులపతుల పోస్టింగులు ఇవ్వాలని చూస్తున్నట్టు వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండు చేశారు. ఉపకులపతుల నియామకం కోసం ఏర్పాటైన సెర్చి కమిటీలో ఒకే ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన 7 మంది ఆచార్యులు ఉన్నారంటే ప్రభుత్వ ఆలోచనా సరళి అర్థమవుతోందని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా అర్హతలు లేని వ్యక్తులకు ఉపకులపతుల పోస్టులు కట్టబెట్టనున్నట్టు జరుగుతున్న ప్రచారంపైనా ప్రభుత్వ పెద్దలు స్పందించాలన్నారు. ఉపకులపతుల నియామకాలపై సరైన చర్యలు చేపట్టాలని సూచించారు.

నేటి గ్రంథాలయంలో సదస్సు... హాజరవుతున్న డి.రాజా

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 30, 31 తేదీల్లో విశాఖ నగరంలో జరుగుతాయని సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ సమావేశాలకు దేశం నలుమూల నుంచి పార్టీ కీలక నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పాలన, వివిధ రంగాల పరిస్థితిపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్టు వివరించారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 29 వ తేది సాయంత్రం 5 గంటలకు నగరంలోని పౌర గ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర-భవిష్యత్తు సవాళ్లు' అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రసంగిస్తారని తెలిపారు.

ఎస్ఆర్ శంకరన్ భావితరాలకు ఆదర్శం

జల్లి విల్సన్, బుద్ధ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి: ఎస్ఆర్ శంకరన్ జీవితం భావితరాలకు ఆదర్శం కావాలని ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, మాజీమంత్రి, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆకాంక్షించారు. కృష్ణాజిల్లా మోపిదేవిలోని బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్‌ను ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి జల్లి విల్సన్, బుద్ధప్రసాద్ పరిశీలించారు. దేశం గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తి శంకరన్ అని కొనియాడారు. ఏ అధికారి పేరును దేశంలోని వ్యవస్థలకు పెట్టిన దాఖలాలు లేవని, శంకరన్ చేసిన గొప్ప సేవలకుగాను ఆయనకు ఈ అరుదైన గౌరవం అని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శంకరన్ నిరంతరం కృషి చేసినట్లు గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు నాలెడ్జ్ సెంటర్లు దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని జల్లి విల్సన్, బుద్ధ ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో శంకరన్ మెమోరియల్ ట్రస్ట్ సమన్వయ కర్త పుప్పాల చిన్న సాయిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉపాధ్యక్షులు కరువాది సుబ్బారావు, బుట్టి రాయప్ప, సంగుల పేరయ్య, గిరిజన సమాఖ్య నాయకులు లాహిరి తీర్పి, శంకరన్ మెమోరియల్ ట్రస్టీ గూడెం శెట్టి వెంకటేశ్వర్లు, శ్రేయోభిలాషి శ్రీధర్, బీసీ సంక్షేమాధికారి అవనిగడ్డ దివ్య, వసతి గృహం వార్డెన్ కుంభా లంకేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి శనివారం నో బ్యాగ్ డే

- జీవో 117 ఉపసంహరణపై ఆమోదయోగ్య పరిష్కారం
- ఉపాధ్యాయులకు ఇకపై ఒకటే యాప్
- సమీక్షలో విద్యాశాఖ మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించాలని, విద్యార్థులకు సహపాఠ్య ప్రణాళిక కార్యకలాపాలను రూపొందించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకటే యాప్‌ను రూపొందించే కార్యక్రమాన్ని త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. సోమవారం ఉండవల్లిలోని తన కార్యాలయంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. జీవో-117 ఉపసంహరణపై ఆయా జిల్లాల కలెక్టర్ల అధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పాఠశాల విద్యా సంచాలకులు నిర్వహించిన సన్నాహక సమావేశాలలో వచ్చిన అభిప్రాయాలను, సూచనలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. ఆయా సూచనలను పరిగణనలోకి తీసుకుని ఏ విద్యార్థి డ్రాప్ అవుట్ అవకుండా చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు. పాఠశాల విద్యలో గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో-117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని లోకేశ్ అధికారులను ఆదేశించారు. అతి త్వరలోనే చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీ చట్టంపైనా సమావేశంలో చర్చించారు. ఈ చట్టంపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధారించేందుకు అపార్ ఐడీని అనుసంధానించే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ప్రజాభిప్రాయసేకరణ కోసం అతి త్వరలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖలో చేపట్టబోయే సంస్కరణలపైనా సమావేశంలో విపులంగా మంత్రి చర్చించారు. ఈ భేటీలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి.విజయ్ రామరాజు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ వైద్య విద్యార్థుల రిజిస్ట్రేషన్ల నిలిపివేత!

ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యామండలి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆన్‌లైన్ అధ్యయనానికి దీటుగా ఆఫ్‌లైన్ విద్య పూర్తి చేయనటువంటి వైద్య విద్యార్థులతోపాటు అదనపు సంవత్సరపు ఇంటర్న్‌షిప్ చేసేందుకు నిరాకరిస్తున్న వైద్య విద్యార్థుల శాశ్వత రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యా మండలి (ఏపీఎంసీ) స్పష్టంచేసింది. ఈ మేరకు సోమవారం ఏపీఎంసీ ఒక ప్రకటన విడు దల చేసింది. ఈ కేటగిరీలకు సంబంధించి 25 మంది ఎఫ్ఎంసీ బృందం రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అది పెండింగ్‌లో ఉందని గుర్తుచేసింది. కరోనా-19, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా తమ ఎంబీబీఎస్ కోర్సులో కొంత భాగాన్ని ఆన్‌లైన్లో పూర్తి చేసిన విదేశీ వైద్య విద్యార్థులు...రాష్ట్రంలో ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన తర్వాత శాశ్వత రిజిస్ట్రేషన్ (పీఆర్) మంజూరు చేయాలని తమకు అభ్యర్థనలు వచ్చినట్లు చాలా మంది విదేశీ వైద్య విద్యార్థులు దేశానికి తిరిగి వచ్చి.. ఆన్‌లైన్‌లో తమ వైద్య విద్యను కొనసాగించారని తెలిపింది. తరువాత ఆఫ్‌లైన్ మోడ్‌లో కోర్సు మిగిలిన భాగాన్ని పూర్తి చేయడానికి గాను విదేశీ విశ్వవిద్యాలయాలకు తిరిగి వెళ్లారని వివరించింది. దీనికి ప్రతిస్పంద నగా, జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నవంబర్ 22, 2023న మార్గదర్శకాలను జారీజేసిందని, దీని ప్రకారం విద్యార్థి చివరి సంవత్సరం ఆన్‌లైన్‌లో చదివిన విదేశీ వైద్య విద్యార్థులు రెండేళ్ల ఇంటర్న్‌షిప్ (ఒక సంవత్సరం క్లినికల్ క్లర్క్‌షిప్, ఒక సంవత్స రం ఇంటర్న్‌షిప్) చేయాల్సి ఉంటుందని పేర్కొంది. చివరి ముందు సంవత్సరాల్లో ఆన్‌లైన్‌లో చదివిన వారు..మూడు సంవత్సరాల ఇంటర్న్‌షిప్ (అనగా, రెండు సంవత్సరాల క్లినికల్ క్లర్క్‌షిప్, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్) పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ కొనసాగిస్తున్న కొంతమంది విదేశీ వైద్య విద్యార్థులు ఈ సూచనల్ని నిరాకరిస్తూ.. వారు అధ్యయనం చేసిన విశ్వవిద్యాలయాల నుంచి కాంపెన్సేటరీ లేఖలను అంగీకరించమని అభ్యర్థిస్తూ ప్రతిపాదనలను సమర్పించారని వివరించారు. ఆన్‌లైన్ అధ్యయనాలకు తగిన కంపెన్సేటరీ ఆఫ్ లైన్ విద్యా కాలం ధృవీకరించడానికి అవసరమైన వివరాలను లేఖలలో పేర్కొనలేదని, అందువల్ల శాశ్వత రిజిస్ట్రేషన్‌లను జారీ చేయాలనే వారి అభ్యర్థనను పరిగణించబోదని స్పష్టంచేసింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) గతేడాది నవంబర్ 19న జారీజేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా..శాశ్వత రిజిస్ట్రేషన్లు మంజూరు చేసే ముందు రాష్ట్ర వైద్య మండళ్లు సంబంధిత భారత రాయబార కార్యాలయం ద్వారా విదేశీ వైద్య గ్రాడ్యుయేట్ల (ఎఫ్ఎంజీఎస్) డిగ్రీలను ధృవీకరించాలని ఆదేశించిందని గుర్తుచేసింది.



క్యూబాకు సంఘీభావం

దిల్లీ సదస్సులో రూ.లక్ష విరాళమిచ్చిన అమర్‌జిత్ కౌర్

న్యూఢిల్లీ: క్యూబాకు సంఘీభావం తెలుపుతూ దేశ రాజధాని దిల్లీలో 'నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా' అధ్వర్యంలో మంగళవారం సదస్సు జరిగింది. క్యూబా విప్లవ నాయకుడు జోసె మార్టి 172వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ సదస్సుకు ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు పల్లబ్ సేన్ గుప్తా అధ్యక్షత వహించారు. క్యూబాకు అంతర్జాతీయ సంఘీభావం అవసరాన్ని వక్తలు తెలిపారు. దశాబ్దాలుగా అమెరికా విధిస్తున్న ఆంక్షలతో ఇబ్బంది పడుతున్న క్యూబాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా చైర్మన్ ఎంఏ బాబీ తాము అనుసరించబోయే సంఘీభావ ప్రణాళికలను వివరించారు. కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ సంఘీభావ కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేలా యువతను చైతన్య పర్చాలన్నారు. సదస్సులో పాల్గొన్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్... సంఘీభావ సంబంధిత కార్యకలాపాల కోసం రూ.లక్ష విరాళమిచ్చారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, బీకేఎంయూ కార్యదర్శి వీఎస్ నిర్మల్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, ఏఐవైఎఫ్ కార్యదర్శి రోషన్ కుమార్ సిన్హా, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు వీరాజ్ దేవంగ్ కూడా తమ వంతు సహకారాన్ని అందజేశారు. క్యూబాకు సంఘీభావం ప్రకటించారు. సదస్సులో సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్, సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

ఏబీవీ సస్పెన్షన్ కాలం క్రమబద్ధీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ కాలాన్ని క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం మంగళవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో రెండు దఫాలుగా ఏబీవీపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఆ కాలాన్ని విధులు నిర్వహించినట్టుగా క్రమబద్ధీకరిస్తూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2020 ఫిబ్రవరి 2 నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకు మొదటి దఫా ఏబీవీపై గత ప్రభుత్వం వేటు వేసింది. రెండో విడతలో 2022 జూన్ 28 నుంచి 2024 మే 30వ తేదీ వరకు మరోమారు సస్పెన్షన్ వేటు వేసింది. ఈ రెండు విడతల సస్పెన్షన్ కాలాన్ని విధులు నిర్వహించినట్టుగా పేర్కొంటూ క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆ కాలానికి ఏబీవీకి చెల్లించాల్సిన మొత్తం వేతనాన్ని, అలవెన్సులను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. సస్పెన్షన్ వేటు పడకపోతే ఎంత మొత్తం ఇవ్వాలో ఆ మేరకు చెల్లించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.